



సంయుక్త మీనన్ దివి వధ్య మానసా వారణాసి

నేడు కర్టన్‌రైజర్ ఈవెంట్

విజయవాడ ఉత్సవ్‌లో తొలి అడుగు

- అతిథులుగా సంయుక్త మీనన్, దివి వధ్య, మానసా వారణాసి
- పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో నిర్వహణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'విజయవాడ ఉత్సవ్'కు కౌంట్‌డౌన్ మొదలైంది. కర్టెన్‌రైజర్ ఈవెంట్‌గా ఆదివారం పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో గ్రాండ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నటి సంయుక్త మీనన్, దివి వధ్య రానున్నారు. ప్రత్యేక అతిథిగా ఫెమీనా మిస్ ఇండియా-2020 మానసా వారణాసి హాజరుకానున్నారు. విజయవాడ నగర సంప్రదాయ వారసత్వాన్ని, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తి కార్యక్రమాలు, కళా ప్రదర్శనలు, సెలబ్రెటీల సంగీత కచేరీలు, టాలీవుడ్ ప్రమోషన్స్, ప్రపంచ మిగతా 6లో..

అయ్యో స్వామీ..!

గొడుగుపేట వేంకటేశ్వరస్వామి ఆలయ భూములు ప్రభుత్వం స్వాధీనం

గొల్లపూడిలోని రూ.400 కోట్ల ఆస్తి ఇతర ప్రయోజనాలకు మళ్లింపు

మచిలీపట్నంలోని గొడుగుపేట వేంకటేశ్వర స్వామి ఆలయ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం వివాదాస్పదంగా మారుతోంది. వివిధ కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం గొల్లపూడిలోని 40 ఎకరాలను ప్రభుత్వం తీసుకోనుండటంతో స్వామివారి దూపదీప నైవేద్యాలకు ఆదాయం ఎలా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం.. అభివృద్ధి కార్యక్రమాల కోసం ఆ భూములు తీసుకుంటున్నా.. దాని విలువ ప్రకారం దేవస్థానం అకౌంట్‌లో డబ్బు జమ చేయాలని భక్తులు కోరుతున్నారు.

- ఏటా ఆ భూముల ఆదాయంపైనే స్వామివారి దూపదీప నైవేద్యాలు
- భూములు ప్రభుత్వం తీసుకోవడంతో ఆలయ నిర్వహణకు ఇబ్బందులు
- విలువ ప్రకారం ఆలయ అకౌంట్‌లో డబ్బు జమచేయాలని భక్తుల వినతి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని గొడుగుపేట వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన రూ.కోట్ల విలువచేసే భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఆలయానికి 71 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో 39 ఎకరాల 99 సెంట్లు గొల్లపూడిలో ఉంది. ఈ భూమిని కొందరు కౌలుదారులు సాగు చేసుకుంటున్నారు. వేలంలో పాడుకున్న విధంగా దేవస్థానానికి కౌలు చెల్లిస్తున్నారు. గొల్లపూడిలోని ఈ భూమిని రెండుదశల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి రంగం సిద్ధం చేసింది. మొదటి దశలో ఐదు ఎకరాల భూమిని గోల్ఫ్ రేంజ్‌కు ఇచ్చింది. క్రీడలు, టూరిజం, ఇతర కార్యక్రమాలకు దీనిని వినియోగించనున్నారు. ఇందుకు జీవో జారీ మిగతా 6లో..



గొడుగుపేట వేంకటేశ్వరస్వామి ఆలయం

ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే ఆదాయం ఎలా?

గొల్లపూడిలోని అత్యంత విలువైన ఆ 40 ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకోవడం వల్ల ఆలయ ఆదాయానికి గండి పడనుంది. 71 ఎకరాలకు ఇప్పటికే నామమాత్రంగా సంవత్సరానికి రూ.10 లక్షల ఆదాయం వస్తోంది. గొల్లపూడిలోని 40 ఎకరాల నుంచి రూ.ఐదారు లక్షల కంటే ఎక్కువ ఆదాయం రావట్లేదు. ఇక్కడ ఎకరం రూ.10 కోట్లు ఉండగా, 40 ఎకరాల విలువ రూ.400 కోట్ల వరకూ ఉంటుంది. దేవాలయ అభివృద్ధికి దాతలు ఇచ్చిన భూములను ఆలయ ప్రయోజనాల కోసం వినియోగించాలి. అలాకాకుండా ప్రభుత్వం భూమి తీసుకుంటే ఆలయ నిర్వహణ ఎలా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



మహా నిమజ్జనం



మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో నిమజ్జనాలు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యాధరపురంలో ఏర్పాటుచేసిన 72 అడుగుల మట్టి కార్యసిద్ధి మహాగణపతి విగ్రహ నిమజ్జనం శనివారం రాత్రి ఘనంగా పూర్తయ్యింది. ఉన్నచోటనే ఫైరింజన్ పైపులతో నీళ్లు చల్లి నిమజ్జన కార్యక్రమాన్ని ముగించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సేవా సమితి వ్యవస్థాపకుడు డూండీ రాకేశ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు డి.వెంకట సుబ్బారావు, ఏ.సత్యనారాయణరావు, జీవీబీ రవికుమార్, పి.వెంకట రవికుమార్, ఎన్.నాగేశ్వరరావు, కొత్తా ముత్రేశ్వరరావు, సామా చైతన్య, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. - విద్యాధరపురం



ఇక 350 సీసీ రేంజ్ బైకుల జోష్

- జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గింపు
- దసరా పండుగకు దిగిరానున్న ధరలు
- విజయవాడ కేంద్రంగా పెరగనున్న కొనుగోళ్లు

- కథనం 6లో

దసరాకు పశ్చిమ బైపాస్

తాత్కాలికంగా అందుబాటులోకి తేవాలని నిర్ణయం

- ఎన్‌హెచ్ అధికారులతో ఎంపీ కేశినేని చిన్ని చర్చలు
- సంక్రాంతి నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ పశ్చిమ బైపాస్‌ను సంక్రాంతికి పూర్తిస్థాయిలో ప్రారంభించటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అలాగే, రాబోయే దసరా ఉత్సవాలను పురస్కరించుకుని తాత్కాలికంగా వాహనాలను మళ్లించాలని నిర్ణయించారు. దసరా ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలిరానున్నారు. అలాగే, దసరా ఉత్సవ్-2025, కృష్ణా వ్యవసాయ, పారిశ్రామిక ఎగ్జిబిషన్ జరగనున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండాలంటే విజయవాడ పశ్చిమ బైపాస్‌ను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. దీంతో నిర్వాహక కమిటీ సభ్యులు, ఎంపీ కేశినేని చిన్ని.. జాతీయ రహదారుల సంస్థ అధికారులతో చర్చించారు. ప్రస్తుతం విజయవాడ వెస్ట్ బైపాస్ రెండు ప్యాకేజీలు కలిపి దాదాపు 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. మిగిలిన 10 శాతం పనుల విషయంలో ఇబ్బందులు ఉన్నాయి. ఇవి ఇప్పుడు పరిష్కారమయ్యేవి కావు. ఈ నేపథ్యంలో దసరా ఉత్సవాలకు తాత్కాలికంగా వెస్ట్ బైపాస్‌ను ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. గత సంక్రాంతి సందర్భంలో, రాజధాని అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన సమయంలో దీనిని విజయవంతంగా ఉపయోగించుకున్నారు. అలాగే, గుంటూరు వైపు నుంచి ప్యాకేజీ-4ను కూడా ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. పూర్తికాని రోడ్డు పోర్షన్‌ను కంకర చిప్స్, డస్ట్‌తో తాత్కాలికంగా అందుబాటులోకి తేవాలని ఎంపీ చిన్ని చెప్పారు. ఇందుకు ఎన్‌హెచ్ అధికారులు కూడా అంగీకరించారు.

నేడు ఇంద్రకీలాద్రి మూసివేత

చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 3.30 నుంచి..

తిరిగి సోమవారం ఉదయం 8.30 నుంచి దర్శనం



ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాహుగ్రస్థ చంద్రగహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయాన్ని మూసివేయనున్నారు. ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలకు కవాట బంధనం చేస్తున్నట్లు ఈవో శీనానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణ మోక్షకాలం అనంతరం.. అంటే 8వ తేదీ సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు కవాట ఉద్ఘాటనం చేసి తలుపులు తెరుస్తామని, దేవతామూర్తులకు స్నపనాభిషేకాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం అలంకరణ, అర్చన, మహానివేదన, హారతి జరుగుతాయని, సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తామని తెలిపారు. స్నపనాభిషేకాలు, అర్చనాది కార్యక్రమాల సందర్భంగా ఆర్జిత సేవలైన సుప్రభాతం, వస్త్రం, ఖడ్గమాలార్చన, నవగ్రహ శాంతిహోమం, గణపతి హోమాలను రద్దు చేశామని వివరించారు. రోజూ ఉదయం 7.30 గంటలకు నిర్వహించే ఆర్జిత సేవలను సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. కాగా, గ్రహణం సందర్భంగా జిల్లాలోని అన్ని ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేస్తారు. సోమవారం శుద్ధిచేసి భక్తులను అనుమతిస్తారు.

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణరావు



న్యాయమూర్తికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు శనివారం దర్శించుకున్నారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానానికి వచ్చిన ఆయనకు తొలుత ఆలయ ఈవో వి.కె.శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండితులు ఆశీర్వాచనం పలుకగా, ఈవో అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఈ సందర్భంగా దసరా-2025 ఏర్పాట్ల గురించి వివరించారు.

ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనుల తనిఖీ



అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ ఆలయం అభివృద్ధి పనులను దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన అన్నదాన భవనం, లడ్డూ పోటు, కనకదుర్గానగర్‌లో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల స్థితిగతులపై ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల సౌకర్యార్థ చేపట్టిన పనులు సకాలంలో పూర్తి కావాలని, పనుల నాణ్యత విషయంలో రాజీ వద్దని కమిషనర్ సూచించారు. ఆలయ అభివృద్ధి పనులు, దసరా ఉత్సవాల పనులు ఏకకాలంలో పూర్తి కావాలని, ఏ పనులు ఎప్పటికి పూర్తి అవుతాయో పూర్తి సమాచారంతో వివరాలు అందించాలని దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.రాంబాబు, తదితర అధికారులను ఆదేశించారు.

విచారణ తర్వాత బాధ్యులపై చర్యలు

- జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నందిగామ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దవరం సహకార సంఘంలో అక్రమాలపై విచారణ జరుగుతుందని, విచారణ తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకొంటామని జిల్లా సహకార అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెద్దవరం సహలకార సంఘంలో 'పెద్దమాయ' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందిం చారు. ఈ సంఘంలో జూలై మాసంలో ఆడిట్ జరిగిందని, ఆ ఆడిట్‌లో కొన్ని అవకతవకలు వెలుగు చూశాయని తెలిపారు. దీనిపై ఆడిట్ అధికారులు నివేదిక అందించారని చెప్పారు. ఆ నివేదిక ఆధారంగా సహకార చట్టం సెక్షన్ 51 ప్రకారం విచారణ చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా సమన్లు జారీ చేసినట్లు చెప్పారు. విచారణ పూర్తయిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకొంటామని వివరించారు. ఉన్నతాధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణ నిజం కాదని చెప్పారు.

అన్నదాన భవనం, లడ్డూ పోటులో వంటకు శ్రీకారం



గ్యాస్ సిలిండర్ వెలిగిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి కొండ దిగువన నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనం, లడ్డూ పోటులో దసరా ఉత్సవాలలో అన్న ప్రసాదం తయారీ, లడ్డూ ప్రసాదం తయారీ నిమిత్తం వంట ప్రారంభించేందుకు శనివారం దేవస్థానం స్థానాచార్యుడు వి.శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శీనానాయక్ పొయ్యలు వెలిగించి పాలు పొంగించి వంటలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈవో శీనానాయక్ మాట్లాడుతూ భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. దసరా ఉత్సవాలలో భక్తులకు నిరంతరం అమ్మవారి ప్రసాదాలు అందించడానికి ఈ రెండు కొత్త ప్రాంగణాలు ఉపయోగపడతాయన్నారు. అల్పాహారం, అన్న ప్రసాదం, ఉచిత ప్రసాదాలు, మూలా నక్షత్రం, విజయదశమి రోజుల్లో చిన్న లడ్డూ పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కోటేశ్వరరావు, రాంబాబు, ఏఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రతి పౌర్ణమి రోజున నిర్వహించే గిరి ప్రదక్షిణ ఆదివారం ఉదయం 5.55 గంటలకు ప్రారంభమవుతుంది. ఘాట్ రోడ్డు ప్రవేశ ద్వారం వద్ద ఉన్న శ్రీకామధేను అమ్మవారి ఆలయం నుంచి మొదలై కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం జంక్షన్ కబేళా రోడ్డు, సీవీఆర్ బ్రిడ్జి, పాల ఫ్యాక్టరీ, భీమనవారి పేట, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ మీదుగా తిరిగి కొండపైకి గిరిప్రదక్షణలోని దుర్గామల్లేశ్వరుల ఉత్సవమూర్తులు చేరుకుంటారు. యథాస్థానంలో ప్రవేశిస్తాయి.

యూరియా సరఫరాపై రైతులకు అవగాహన కల్పించండి

- అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం



మచిలీపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, యూరియా సరఫరాపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. కలెక్టర్ చాంబరు నుంచి జేసీ గీతాంజలిశర్మతో కలసి శనివారం వ్యవసాయ అధికారులు, మండల స్థాయి అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారని తెలిపారు. రైతులకు అందుబాటులో యూరియాను ఉంచాలని చెప్పారన్నారు. జిల్లాలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఇంకా అవసరమైన యూరియాను రప్పిస్తామని చెప్పారు. మండల స్థాయిలో తహసీల్దార్‌లు, వ్యవసాయశాఖ, ఎంపీడీవోలు, ఉద్యానశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి యూరియా సరఫరాను పర్యవేక్షించాలన్నారు.

ఇక 350 సీసీ రేంజ్ బైకుల జోష్



- జీఎస్టీ 28 నుంచి 18 శాతం తగ్గించిన కేంద్ర ప్రభుత్వం
- దసరా పండుగకు దిగిరానున్న ధరలు
- విజయవాడ కేంద్రంగా పెరగనున్న కొనుగోళ్లు
- పండుగ సీజన్‌లో భారీగా డిమాండ్ ఉంటుందని అంచనా

> యువత మనస్సు దోచుకునే 350 సీసీ రేంజ్ బైకుల ధరలు ఇక దిగిరానున్నాయి. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించడంతో ఎక్కువ మంది కొనుగోలు చేయడానికి అవకాశం ఏర్పడింది. దసరా పండుగ కూడా త్వరలోనే ఉండటంతో అమ్మకాలు జోరందుకోనున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కుర్రకారు ఎక్కువగా ఇష్టపడే బైకుల్లో 350 సీసీ బైకులకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. అన్ని వర్గాల యువతను ఈ బైకులు ఆకర్షిస్తుంటాయి. వీటిని కొనుగోలు చేయాలన్న ఆశ ఉన్నా.. ధరలు అధికంగా ఉండటం వల్ల చాలా మంది అందుకోలేకపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జీఎస్టీ మినహాయింపుల ప్రకటనలతో 350 సీసీ బైకుల ధరలు దిగి రానున్నాయి. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా 350 సీసీ బైకులు పెరిగే అవకాశం ఉంది. నగరంలో 350 సీసీ బైక్ శ్రేణిలో రాయల్ ఎన్‌ఫీల్డ్, హార్లే డేవిడ్‌సన్ ప్రధానంగా ఉన్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు నగరంలో మూడు ఏజెన్సీలు ఉండగా.., ఉమ్మడి కృష్ణాజిల్లాలో పలు చోట్ల ప్రాంతీయంగా కూడా ఉన్నాయి. హార్లే డేవిడ్ సన్‌కు నగరంలో ఒకే ఒక్క షోరూమ్ ఉంది. నగర యువత కానీ, ఉమ్మడి జిల్లాకు చెందిన యువత కానీ ఎక్కువగా రాయల్ ఎన్‌ఫీల్డ్ 350 సీసీ బైకులను ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. ఎన్‌ఫీల్డ్ బైకులు అయితే కాస్త అందుబాటు ధరల్లో ఉంటాయి.

10శాతం తగ్గనున్న ధరలు

350 సీసీ బైకులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 28 శాతం జీఎస్టీ విధిస్తోంది. దీంతో ప్రస్తుతం రూ.2.50 లక్షల మేర ధర పలుకుతోంది. ఇటీవల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన జీఎస్టీ మినహాయింపుల మేరకు 350 సీసీ బైకులకు 28 శాతం నుంచి 18 శాతం తగ్గించటం జరిగింది. దీంతో ఒకేసారి 10 శాతం మేర 350 సీసీ బైకుల ధరలు తగ్గనున్నాయి. జీఎస్టీతో పాటు బైకుల ఆన్‌రోడ్ ప్రైజ్ కూడా గణనీయంగా తగ్గనుంది. ఆన్‌రోడ్‌లో భాగంగా రోడ్డు ట్యాక్స్, ఇన్సూరెన్స్ వంటివి కూడా కలిసి ఉంటాయి. రోడ్డు ట్యాక్స్, ఇన్సూరెన్స్ కాంపోనెంట్స్‌లో కూడా కొంత మేర తగ్గుదల ఉంటుందని తెలుస్తోంది. ఇవన్నీ కలిపితే దాదాపుగా మొత్తం రూ.30 వేల వరకు 350 సీసీ బైకుల ధర తగ్గనుంది. ప్రస్తుతం హై ఎండ్ ఎలక్ట్రికల్ స్కూటర్ల శ్రేణిలో ధరలతో సమానంగా 350 సీసీ హయ్యండ్ బైకుల ధరలు కూడా ఉండబోతున్నాయి. వివిధ వర్గాల యువతకు ఇది శుభపరిమాణమనే చెప్పుకోవాల్సి ఉంటుంది.

నెలకు 350 బైక్‌ల విక్రయం

విజయవాడ నగరంలో నెలకు 350 వరకు ఎన్‌ఫీల్డ్ బైకులు విక్రయిస్తున్నారు. అదే పండుగల సందర్భంలో అయితే 500 వరకు బైకులు అమ్ముడు పోతున్నాయి. ఈ లెక్కన చూస్తే ప్రస్తుత జీఎస్టీ తగ్గుదల కారణంగా 350 సీసీ బైకుల కొనుగోలుకు డిమాండ్ ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక మీదట నెలకు 500 వరకు బైకులు అమ్మగలమని భావిస్తున్నాయి. అలాగే పండగ సీజన్ నేపథ్యంలో 700 వరకు బైకులు అమ్మగలమని అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం అతిపెద్ద పర్వదినం దసరా వస్తుండటంతో.. బైకుల కొనుగోళ్ల డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఇదే క్రమంలో 350 సీసీ బైకులు అనేవి ఇప్పటికిప్పుడు తయారయ్యేవి కావు. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వాటినే తక్కువ ధరకు విక్రయించగలవు. ఈ పండుగ సీజన్‌కు అయితే ఉన్న వాటినే విక్రయించగలవు. తయారీకి సమయం పడుతుంది కాబట్టి పండగ తర్వాత నాటికి మరిన్ని అందుబాటులోకి రాగలవు.

పెరగనున్న 650 సీసీ బైకుల ధరలు

ఉన్నత వర్గాలు ఆదరించే 650 సీసీ బైకుల ధరలు మాత్రం గణనీయంగా పెరగబోతున్నాయి. ప్రస్తుతం 28 శాతం ఉన్న జీఎస్టీని మరో 12 శాతం అదనంగా జోడించటంతో 40 శాతానికి జీఎస్టీ పెరిగింది. దీంతో ఈ బైకుల ధరలు భారీగా పెరగనున్నాయి. ప్రస్తుతం 350 సీసీ బైకుల ధర చూస్తే కనిష్ఠంగా రూ.4,50,000 ఉంది. జీఎస్టీ పెరుగుదలతో రూ.5 లక్షలకు చేరువుగా బైకుల ధరలు పెరిగే అవకాశం ఉంది.

కొనుగోళ్లు పెరుగుతాయని భావిస్తున్నాం



ద్విచక్రవాహనాల శ్రేణిలో ప్రధానంగా 350 సీసీ బైకులకు జీఎస్‌టీని తగ్గించారు. దీంతో విక్రయాలలో పురోగతి ఉంటుందని భావిస్తున్నాం. ప్రస్తుత తగ్గింపు ప్రకారం రూ.15 వేల వరకు తక్షణం తగ్గే అవకాశం ఉంటుంది. వివిధ మోడళ్లను బట్టి రూ.20 వేల వరకు బైకుల ధరలు తగ్గనున్నాయి. జీఎస్టీ తగ్గింపులతో పాటు దసరా కూడా రాబోతోంది. దీంతో మరింతగా సేల్స్ ఉండే అవకాశం ఉంది. దీనికి అనుగునంగా మేము కూడా ఏర్పాట్లు చేసుకుంటున్నాం.

-హరీష్, రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్



కొండాలమ్మ సన్నిధిలో రైల్వే రిజిస్ట్రార్

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మను సికింద్రాబాద్ రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ బెంచ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.ప్రదీప్ కుమార్ దంపతులు శనివారం దర్శించుకొన్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం అనంతరం వీరిని సత్కరించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వైద్యుల సమస్యలపై మంత్రికి వినతి

విజయవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ పబ్లిక్ హెల్త్‌లో పనిచేస్తున్న వైద్యులు 25 ఏళ్ల సర్వీసులో ఒక్కసారి కూడా పదోన్నతి పొందకుండానే పదవీ విరమణ చేస్తున్నారని జీడీఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బాబ్జీ శ్యామ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో ప్రతి 3-4 ఏళ్లలోనే పదోన్నతలు ఇస్తున్నారన్నారు. సర్వీసు వైద్యుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు తగదన్నారు. వైద్యుల పదోన్నతుల పరిష్కారం కోసం తమిళనాడు, కేరళ, ఒడిశా, కర్ణాటక లాంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానం అమలు చేయాలని కోరారు. జనరల్ కేటగిరీ వైద్యులందరినీ ఒకే సీనియారిటీ పరిధిలోకి తీసుకురావాలని, నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలోని ఉన్నతస్థాయి పదవులను వైద్యాధికారులతో మాత్రమే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ పోస్టుల్లో సివిల్ సర్జన్ స్థాయి వైద్యులను, జిల్లాస్థాయి ప్రోగాం ఆఫీసర్ పోస్టుల్లో డిప్యూటీ సివిల్ సర్జన్ వైద్యులను నియమించాలని కోరారు.



మంత్రి సత్యకుమార్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు

9న ఎన్టీఆర్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

- 27, 28వ స్నాతకోత్సవాలు ఒకేసారి నిర్వహణ
- వీసీ డాక్టర్ చంద్రశేఖర్ వెల్లడి

విజయవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం ఈ నెల 9న నిర్వహించనున్నట్టు వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆవరణంలో మీడియాతో ఆయన మాట్లాడారు. కోవిడ్ కారణంగా 2021 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన 27వ, 2022 ఏడాది బ్యాచ్‌కు చెందిన 28వ స్నాతకోత్సవాలు నిర్వహించలేదన్నారు. ఈ రెండు స్నాతకోత్సవాలు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన జరుగుతాయన్నారు. 27వ స్నాతకోత్సవానికి సంబంధించి 53 మంది విద్యార్థులకు, 28వ స్నాతకోత్సవానికి సంబంధించి 67 మంది విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందించనున్నట్టు చంద్రశేఖర్ తెలిపారు. యూనివర్సిటీలో రీసెర్చ్ యాక్టివిటీస్ కోసం రూ.75 లక్షల గ్రాంట్ ఇచ్చినట్టు తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రభ, జాయింట్ రిజిస్ట్రార్(అకడమిక్) కె.నీలిమ, డిప్యూటీ రిజిస్ట్రార్ కె.సుసన్న రామర్స్, ప్రెస్ అండ్ మీడియా కన్వీనర్ ఎమ్.వి.అక్కిరాజు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

విజయవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో జరిగిన ప్రధానమంత్రి సభకు బందోబస్తు నిర్వహించడానికి వెళ్లి మరణించిన హోంగార్డు కుటుంబానికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. ఎస్.అర్జునరావు హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తించేవారు. ప్రధాన మంత్రి బందోబస్తు నిమిత్తం విశాఖపట్నం వెళ్లిన ఆయన అక్కడ గుండె పోటుతో మరణించారు. దీంతో ఆయన భార్య ఎన్వీ లక్ష్మికి రూ.5లక్షల చెక్కును సీపీ రాజశేఖరబాబు అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్‌ఐ కె.సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలోకి నూతన జాగిలం



నూతన జాగిలం విక్టర్‌తో ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా పోలీస్ శాఖలోకి విక్టర్ అనే నూతన జాగిలం వచ్చి చేరింది. పోలీస్ డాగ్ విక్టర్ శిక్షణా సమయంలో సాధించిన పతకాలు, కప్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రదర్శించారు. వీటిని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పరిశీలించారు. అనంతరం ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో పాటు నూతన జాగిలం చేరికతో జిల్లా పోలీస్ విభాగం దర్యాప్తు, నేరపరిశోధన మరింత సమర్థవంతంగా నిర్వహించగలుగుతామన్నారు. పోలీస్ డాగ్ విక్టర్ నేరస్తులను గుర్తించటంతోపాటు ఎక్స్‌ప్లోజివ్స్‌ని గుర్తించటంలో ప్రత్యేక శిక్షణ పొందినట్టు తెలిపారు. ఈ జాగిలం 11 నెలలపాటు ప్రత్యేక శిక్షణ తీసుకుని, శిక్షణా కాలంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడవ స్థానం సాధించి జిల్లా డాగ్ స్క్వాడ్‌కు గౌరవాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. శిక్షణా కాలంలో పోలీస్ డాగ్‌తో పాటు పనిచేసిన కానిస్టేబుళ్లు డి.నవీన్ బాబు, కె.బాబురావులను ఎస్పీ అభినందించారు.

అయ్యో స్వామీ..!

(5వ పేజీ తరువాయి)

చేయనున్నారు. రెండోదశలో మరో 35 ఎకరాలను ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు వినియోగించనున్నారు. ఇందుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే దేవదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి లేఖ రాశారు.

నాటి ధర్మకర్త దాతృత్వం

వేంకటేశ్వరస్వామి ఆలయానికి నాటి న్యాయవాది ఏసీ ఉడయవర్లు వంశపారంపర్య ధర్మకర్తగా ఉండేవారు. నాడు ఒక్క ఉడయవర్లు మాత్రమే 71 ఎకరాల ఆస్తులను పరిరక్షించారు. ఆయన మృతిచెందాక ఈ ఆలయం దేవదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది. కార్యక్రమాల నిర్వహణ సన్నగిల్లింది.

ఒకసారి చెర వీడినా..

గతంలో ఈ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం దత్తత తీసుకుంది. ఆ సమయంలో దుర్గగుడి అధికారులు గొల్లపూడిలోని 40 ఎకరాల్లో క్వార్టర్లు, కార్యాలయాలు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ సమయంలో గొడుగుపేట వేంకటేశ్వరస్వామి భక్తుల గోడును 'ఆంధ్రజ్యోతి' వినిపించింది. ఆ కథనంతో వేంకటేశ్వరస్వామి దేవాలయం.. దుర్గగుడి నుంచి దేవదాయశాఖకు రావడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, గొల్లపూడిలోని భూములను సాగు చేసుకుంటున్న కౌలురైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఐదు ఎకరాల భూమిని మెరక చేస్తున్న నేపథ్యంలో కొందరు ఎస్టీ కౌలు రైతులు ఆందోళనకు దిగుతున్నారు.

ఇలా చేస్తే మంచిది

నిమ్మలూరులోని బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన 40 ఎకరాల భూములను గతంలో బెల్ కంపెనీ తీసుకుంది. దీనిపై ఆ ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ముత్తేవి రవికాంత్ కోర్టును ఆశ్రయించారు. ఆ భూములను కొనుగోలు చేసిన ప్రతిఫలాన్ని ఆలయానికి అందజేయడంతో కేసు వెనక్కి తీసుకున్నారు. బెల్ కంపెనీ భూములు తీసుకున్నప్పటికీ బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.12 కోట్ల డిపాజిట్లు చేకూరాయి. గొడుగుపేట ఆలయ భూములకు కూడా మార్కెట్ రేటుకు కొని దేవాలయ అకౌంట్‌లో డిపాజిట్ చేయాలని భక్తులు కోరుతున్నారు. కాగా, దీనిపై ఆలయ కార్యనిర్వహణాధికారి గోపాలరావును వివరణ కోరగా, తనకు ఇప్పుడే ఈ సంగతి తెలిసిందన్నారు. ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్తాం.. : ధర్మకర్తల మండలి

దీనిపై మూడు రోజుల క్రితం ప్రమాణ స్వీకారం చేసిన ధర్మకర్తల మండలి చైర్మన్ వడ్లమూడి లక్ష్మీనరసింహారావును 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించింది. సమస్యను మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు.

నేడు కర్టన్‌రైజర్ ఈవెంట్

(5వ పేజీ తరువాయి)

రికార్డును నెలకొల్పేలా వరల్డ్ కార్నివాల్, కృష్ణానది ఒడ్డున డ్రోన్‌షో, ఫైర్‌వర్క్స్, చేనేత హస్తకళల ప్రదర్శనలు, ఫుడ్‌కోర్టులు, ఎగ్జిబిషన్లు, ప్రత్యేక పోటీలు, మిస్ విజయవాడ, విజయవాడ ఐడల్ అవార్డులు, 45 రోజుల పాటు ఎగ్జిబిషన్ నిర్వహణ ఈ విజయవాడ ఉత్సవ్‌లో ప్రత్యేకం. ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్సవ కార్నివాల్‌ను నగరంలో నిర్వహించటంతో పాటు ప్రపంచ రికార్డును సాధించేలా చర్యలు చేపట్టడం మరో విశేషం. ఆదివారం జరిగే కర్టెన్‌రైజర్ ఈవెంట్‌లో ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో పాటు ఏపీటీడీసీ ఎండీ అమరపాలి, పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, సుజనా చౌదరి, వసంత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, శ్రీరామ్ రాజగోపాల్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు పాల్గొంటారు.

మా పొట్ట కొట్టొద్దు

- జెన్కో అధికారులకు స్థానిక లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ విజ్ఞప్తి
- బూడిద కాంట్రాక్టు రద్దు చేసి ఉచితంగా ఇవ్వాలని డిమాండ్
- బూడిద చెరువు వద్ద ఆందోళన



బూడిద చెరువు వద్ద స్థానిక లారీ యజమానులు, డ్రైవర్లు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ స్వలాభం కోసం 40 ఏళ్లుగా ఉచితంగా ఇచ్చిన బూడిదను ఇప్పుడు టన్ను రూ.100 ధరకు అమ్మి మా పొట్ట కొటవద్దని జెన్కో అధికారులను స్థానిక లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వేడుకున్నారు. ఎన్టీటీపీఎస్‌కు చెందిన బూడిద చెరువు వద్దకు శనివారం సుమారు 40 మంది స్థానిక లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ చేరుకొని ఆందోళన చేశారు. బూడిద చెరువులో పని చేస్తున్న కాంట్రాక్టు సంస్థకు చెందిన మూడు యంత్రాలను దగ్గరుండి బయటకు పంపారు. ఈక్రమంలో కాంట్రాక్టు పొందిన సంస్థ సిబ్బందికి, స్థానిక లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్‌కు వాగ్వాదం చోటు చేసుకోగా, జెన్కో పోలీసులు సర్ది చెప్పారు. సోమవారం వరకు పనులు ఆపేయాలని కాంట్రాక్టు సంస్థ సిబ్బందికి ఎస్ఈ ఆదేశించినట్లు పోలీసులు వారికి చెప్పడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. అనంతరం స్థానిక లారీ ఓనర్స్ డ్రైవర్స్ మాట్లాడుతూ బూడిద చెరువు నిండినప్పుడు ఉచితంగా బూడిదను బయటకు తోలుకెళ్లమని చెప్పారన్నారు. ఇప్పుడు ఒక్కసారిగా ఒక ప్రయివేటు సంస్థకు బూడిదను అమ్ముకునేందుకు టన్ను రూ.3లకు లీజుకు ఇస్తే, వారి వద్ద మేము రూ.100లకు టన్ను కొనుగోలు చేసుకోవాలంటా.. ఇందే దుర్మార్గమని ప్రశ్నించారు. 25 టన్నులు రూ.2,500లకు కొనుగోలు చేసి ఎలా బతకగలమన్నారు. ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యం వల్ల సుమారు ఏడు గ్రామాల ప్రజలతో పాటు మేము బాధితులమే అన్నారు. మా కోసం ఒక ఆసుపత్రి పెడతామని, బూడిదను ఉచితంగా ఇస్తామని, సీఎస్ఆర్ ఫండ్స్ గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్న ఎన్టీటీపీఎస్ యాజమాన్యం ఒక్క హామీని అమలు చేయడం లేదని ఆరోపించారు. సుమారు 1.5 లక్షల మంది ప్రజల్లో అనేక మంది శ్వాస సంబంధిత, కిడ్నీ, కేన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. గతంలో రోజుకు మూడు ట్రిప్పుల బూడిద ఉచితంగా ఇచ్చిన జెన్కో యాజమాన్యం ఇప్పుడు వారానికి రెండు మూడు ట్రిప్పులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బూడిద రవాణాను నమ్ముకొని సుమారు 400 లారీలు ఉన్నాయని, వాటిపై సుమారు 1,000 కుటుంబాల వారు ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు.

రాజధాని వైభవం చాటేలా

19, 20, 21 తేదీల్లో అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్

- జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి రాష్ట్ర చైర్మన్‌చక్రధర్



విజయవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని వైభవాన్ని ప్రతిబింబించేలా అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్ -2025ను నిర్వహిస్తున్నట్టు జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి(నారెడ్కో) రాష్ట్ర చైర్మన్ గద్దె చక్రధర్ అన్నారు. శనివారం ఓ హోటల్‌లో ప్రాపర్టీ ఫెస్టివల్ వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం స్థిరాస్తిరంగం పట్ల సానుకూలంగా చేపట్టిన సంస్కరణల ఫలితంగా ప్రస్తుతం పురోగమన దిశలో ఉన్నామన్నారు. నారెడ్కో సెంట్రల్ జోన్ చైర్మన్ సందీప్ మండవ మాట్లాడుతూ ఈ నెల 19, 20, 21 తేదీల్లో నిర్వహించే కార్యక్రమంలో అమ్మకందారులు ప్రత్యేక రాయితీలు అందిస్తున్నారని తెలిపారు. అర్హతలు ఉన్నవారికి బ్యాంకులు తక్షణ రుణాలు మంజూరు పత్రాలు అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పరుచూరి, సెంట్రల్ జోన్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ హరిప్రసాద్ రెడ్డి, సెంట్రల్‌జోన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ, సీఆర్డీఏ ప్రతినిధులు సీతారామయ్య, వాసిరెడ్డి వంశీ, పి.వి.కృష్ణ, కోడే జగన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	131, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

చురుగ్గా అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణం పనులు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపులపాడు శివాలయంలో నూతనంగా చేపట్టిన హరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. దేవాలయం నిర్మాణానికి ఇటీవల నిర్వహించిన భూమి పూజ దాతలు ముందుకు లక్షలాదిరూ పాయలు విరాళాలు అందిస్తున్నారు. వచ్చిన విరాళాలతో నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా తెలిపారు.



పిల్లల్లో దృష్టి లోపాలకు సరైన చికిత్స అందించాలి

ఉంగుటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో దృష్టి లోపాలను సకాలంలో గుర్తించి సరైన చికిత్స అందించడం ద్వారా కంటి చూపు మెరుగుపడి చదువులో బాగా రాణిస్తారని వీరవల్లి పీహెచ్‌సీ ఆప్తమాలజిస్ట్ కొండలరావు అన్నారు. విద్యార్థుల్లో దృష్టిలోపాలను ముందస్తుగా గుర్తించి, నివారించే చర్యల్లో భాగంగా శనివారం పొట్టిపాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నేత్ర సంబంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 11మంది పిల్లలకు దృష్టిలోపాలున్నట్లు గుర్తించి, కళ్లజోళ్లకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.కృష్ణ, ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కంకిపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమటి గుంట లాకు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిరింగి అశోక్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కలిదిండి మండలం పుట్టగుంట గ్రామానికి చెందిన అశోక్ శుక్రవారం అర్ధరాత్రి కంకిపాడు వైపు నుంచి గుడివాడ వైపు వెళ్తుండగా కోమటిగుంట వద్ద ఉన్న పెద్ద గొయ్యిలో పడటంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆసుపత్రికి తరలించగా ఉదయం 10 గంటల సమయంలో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఘనంగా బాలకృష్ణ తనయుడు

మోక్షజ్ఞ జన్మదిన వేడుకలు

పెనమలూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పోరంకి పాత పోలీసుస్టేషన్ కాల్వ కట్ట వద్ద నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ జన్మదిన వేడుకలు లింగమనేని సందీప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన యువనేత బోడె వెంకట్రామ్ జన్మదిన కేకును కోసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, ఎలమంచిలి ప్రసాద్, పిన్నమనేని సాగర్, మురాల రామకృష్ణ, వీరంకి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ సక్రమంగా చేపట్టాలి

మండల సమావేశంలో అధికారులను కోరిన పలువురు సర్పంచ్‌లు

ఉంగుటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరిలో రెండవ కోటాగా వేసేందుకు యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వచ్చిన అరకొర యూరియా కూడా అర్హులైన రైతులకు అందటంలేదని, యూరియా పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ సర్వసభ్యసమావేశంలో వెల్దిపాడు, వెన్నూతల సర్పంచ్‌లు లాం నాగేశ్వరరావు, టీవీ రామ్మోహనరావు అధికారులను నిలదీశారు. మండలపరిషత్ జనరల్‌బాడీ మీటింగ్ శనివారం ఎంపీపీ వడ్లమూడి సరోజిని అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయం హాలులో జరిగింది. తొలుత మండలంలో చేపట్టిన అభివృద్ధిపనులు, ప్రభుత్వ పథకాలపై ఆయా శాఖల అధికారులతో ఎంపీపీ సమీక్షించారు. అనంతరం సర్పంచ్‌లు అడిగిన ప్రశ్నకు మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్ సమాధానమిస్తూ రైతులందరికీ అవసరమైన యూరియాను అందించేందుకు అన్నిరకాల చర్యలు చేపడుతున్నామన్నారు. మండలంలో 27వేల ఎకరాల్లో సాగులో వున్న వరిపైరుకు 2400 టన్నుల యూరియా అవసరమని, ఇప్పటికే 1800 టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశామని, మిగతా 600టన్నుల యూరియా వారంరోజుల్లో 14 పీఏసీఎస్‌లకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉంగుటూరు, మానికొండ, ఆముదాలపల్లి పీఏసీఎస్‌లకు 15 టన్నుల చొప్పున యూరియా స్టాక్ వచ్చిందన్నారు. మిగతా 11 సొసైటీలకు 140 టన్నుల యూరియా స్టాక్ ఆదివారం వస్తుందని తెలిపారు. వైస్‌ఎంపీపీ వీరంకి కుసుమకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో జుజ్జు ప్రసాద్, ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, పీఆర్ ఏఈఈ జి.శ్రీనివాస్, వివిధశాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఆకునూరు రైతు సహాయ కేంద్రంలో యూరియా వినియోగంపై రైతులకు అవగాన కల్పిస్తున్న ఏడీఏ సునీల్

యూరియాపై ఆందోళన వద్దు

ఉయ్యూరు : రైతులకు అవసరమైన యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రెండు రోజుల్లో మండల పరిధిలో పీఏసీఎస్‌లకు తగినన్ని యూరియా లోడులు వస్తున్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని గన్నవరం ఏడీఏ సునీల్ తెలిపారు. ఆకునూరు రైతు సహాయ కేంద్రానికి శనివారం 15 టన్నుల యూరియా రాగా ఎకరాకు అరకట్ట చొప్పున రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద ఓగిరాల, చినఓగిరాల, గండిగుంట, వీరవల్లి మోఖాసా, బోళ్లపాడు, సాయిపురం పీఏసీఎస్‌లకు 15 టన్నుల చొప్పున యూరియా వస్తుం దని తెలిపారు. రైతులకు అవసరమైన మేర యూరియా పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. తహసీల్దార్ కె. సురేశ్‌కుమార్ ఆకునూరులో యూరియా పంపిణీని పరిశీలించి ఏవిధమైన సంఘటనలకు తావు లేకుండా చేయాలని ఏవో నిస్సిగ్రేస్‌కు సూచించారు.



యూరియా కొరతపై అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు నాగేశ్వరరావు, రామ్మోహనరావు

ఇంటింటికి మనమిత్ర సర్వే విధుల బహిష్కరణ

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందించేందుకు ఉద్దేశించిన ఇంటింటికి మనమిత్ర అవగాహన సర్వే కార్యక్రమాన్ని శనివారం బాపులపాడు మండల సచివాలయం సిబ్బంది బహిష్కరించారు. గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే వలంటీర్ విధులను తాము చేయమని పేర్కొంటూ మండలంలోని సచివాలయ సిబ్బంది ఎంపీడీవో జోగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక పిలుపులో భాగంగా సర్వేను బహిష్కరిస్తున్నట్లు ఎంపీడీవోకు తెలియజేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా మనమిత్ర సర్వేను బహిష్కరించడం సరైన చర్య కాదని వినతిపత్రం స్వీకరించడానికి ఎంపీడీవో నిరాకరించారు. జేఏసీ నాయకుడు సూర్య ప్రకాష్ నాయకత్వంలో సచివాలయ సిబ్బంది వినతి పత్రాన్ని కార్యాలయంలోని టపా బాక్సులో వేసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో మండలంలో నిర్వహించాల్సిన మనమిత్ర సర్వే నిలిచిపోయింది.

ట్రంప్ సుంకాలను వ్యతిరేకించాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి. జమలయ్య

కంకిపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత దేశ ప్రజలపై అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను వ్యతిరేకించాల్సిన అవసరముందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి. జమలయ్య అన్నారు. ట్రంప్ విధించిన సుంకాలకు వ్యతిరేకంగా శనివారం కంకిపాడులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జమలయ్య మాట్లాడుతూ, భారీగా సుంకాలు విధిస్తూ మన దేశం మీద ఆంక్షలు పెడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యే రొయ్యల ఆక్వా పరిశ్రమ చతికిలపడిందన్నారు. రష్యా నుంచి మన దేశానికి మొదటి నుంచి అన్ని విధాలుగా చేయూత అందుతుందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు మాట్లాడుతూ, చిన్న చిన్న దేశాలపై అమెరికా సుంకాల విధిస్తూ తన గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తుందని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోతుకూరి అరుణ కుమార్, బండి ప్రేమ్‌కుమార్, వాటపల్లి ఇస్రాయిల్, పోతురాజు నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు శివశంకర్, బి. మరియదాసు, నాంచారయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు రౌతు రాంబాబు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడు బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు అందించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి వాటి ఆధారంగా యూరియా, డీఏపీ తదితర కాంప్లెక్స్ ఎరువులను అందించాలన్నారు. ఎరువుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన అన్ని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సురవరం సుధాకర్ రెడ్డికి ఘన నివాళి

కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత, లోకసభ మాజీ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని పి. జమలయ్య అన్నారు. స్థానిక ఉపాధ్యాయ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఇబ్రాయిల్, వెంకటేశ్వ రరావు, మండవ శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి ఆక్యుపంక్చర్ యోగాపై శిక్షణ

డాక్టర్ మకాల సత్యనారాయణ

కానూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కానూరులోని ఇండియన్ ఓఏఎం సంస్థ కార్యాలయంలో ఆక్యుంపక్చర్ యోగా విధానంపై ఈనెల 13నుంచి 19వ తేదీ వరకు వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఓఏఎం సంస్థ చైర్మన్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ మకాల సత్యనారాయణ చెప్పారు. శనివారం ఆయన కానూరులోని తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ భారత ప్రభుత్వ ప్రోత్సాహంతో, భారత్ సేవక్ సమాజ్(బీఎస్ఎస్) సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈశిక్షణలో స్వీయ, కుటుంబ ఆరోగ్య బహుల చికిత్సలపై శిక్షణ ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9000347369 సెల్ నెంబరును సంప్రదించాలని డాక్టర్ సత్యనారాయణ కోరారు.

కమిషనర్ నియామకానికి చర్యలు తీసుకోవాలి

ఉయ్యూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇతర పోస్టుల నియామకానికి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్‌ను ఆదేశిస్తూ ఆ శాఖ అసిస్టెంట్ సెక్రటరీ వి.నవీన్‌బాబు ఉత్తర్వులు జారీ చేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. ఉయ్యూరు నగర పంచాయతీ కమిషనర్‌గా ఉన్న పి.వెంకటేశ్వరరావు జూన్ 31న ఉద్యోగ విరమణ చేసినప్పటికి ఇంతవరకు కమిషన ర్‌ను నియమించలేదని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇతర పోస్టులు నెలల తరబడి ఖాళీగా ఉండటం వలన ప్రజలకు కలుగుతున్న ఇబ్బందిని గత నెల 20న మున్సిపల్ శాఖా మంత్రికి, మున్సిపల్ అండ్ పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆమేరకు ఖాళీగా ఉన్న మున్సిపల్ కమిషనర్, ఇతర పోస్టులు నియామకంపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి సిందిగా మున్సిపల్ శాఖ అసిస్టెంట్ సెక్రటరీ ఈ నెల 4న ఆదేశాలు జారీచేసినట్లు శ్రీనివాసగౌడ్ తెలిపారు.



ఉంగుటూరు జడ్పీ హైస్కూల్‌లో వ్యక్తిగత పరిశుభ్రతపై కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మంగమ్మ

ఆరోగ్య సంరక్షణపై కిశోర బాలికలు శ్రద్ధ వహించాలి

ఉంగుటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యసంరక్షణ పట్ల కిశోర బాలికలు శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సీడీపీవో జి.మంగమ్మ అన్నారు. కృష్ణాజిల్లా ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 2నుంచి 12 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పది రోజుల సంకల్ప్ స్పెషల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో భాగంగా శనివారం ఉంగుటూరు జడ్పీహైస్కూల్‌లో విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.పద్మాదేవి, ఎల్.దుర్గాదేవి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాలికలకు, మహిళలకు సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేలా అవగాహనతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తదితర విషయాలపై అవగాహన కల్పించడమే కిశోరిబాలికా వికాసం లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. శాంతిశిరీష తెలిపారు. వీరవల్లి హైస్కూ ల్‌లో హెచ్‌ఎం నిర్మల పర్యవేక్షణలో కిశోరి బాలికా వికాసంలో భాగంగా 9,10 తరగతుల విద్యార్థినులకు సంకల్పపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై సూపర్‌వైజర్ మన్నే ఝాన్సీరాణి వివరించారు. ఈ కార్యక్రమంలో సుహాసిని, నాగమణి, రాజి, రమాదేవి, హేమలత, అంగన్‌వాడీ పాల్గొన్నారు.

ఉయ్యూరు : స్త్రీలు, బాలికల సంపూర్ణ ఆరోగ్యానికి వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షిత ఆరోగ్య పద్ధతులు పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.బేబీసరోజిని అన్నారు. ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కిశోరి బాలికలకు ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం ఆవశ్యకతను ఎంవి రాఘవమ్మ సవివరంగా తెలియ జేశారు. పోక్సో చట్టం లక్ష్యం, ప్రయోజనాలను తెలియజేశారు. ఏఎన్‌ఎంలు రాధిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బుద్దవరం గణేశ్ పూజలో టీడీపీ నేతలు యార్లగడ్డ సతీష్, గద్దె క్రాంతికుమార్

అన్నదానం మంచి సంప్రదాయం

గన్నవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుద్దవరంలో వినాయకుని నిమజ్జన వేడుకల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు టీడీపీ నేత యార్లగడ్డ సతీష్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుమారుడు గద్దె క్రాంతికుమార్‌లు ప్రత్యేక పూజలు శనివారం చేశారు. రామాలయంలో నిర్వహించిన అన్నదానంలో పాల్గొని భోజనాలు వడ్డించారు. పీఏసీఎస్ చైర్మన్ ముద్రబోయిన శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, విజయడెయిరీ డైరెక్టర్ పాలడుగు నాని, నీరుకొండ విజయ్, గొంది శివకోటేశ్వరరావు పాల్గొన్నారు. కేసరపల్లి కొత్తపేటలో గణేష్ ఉత్సవ సమితికి ఉపసర్పంచ్ జాస్తి శ్రీధర్‌బాబు రూ.50వేలు విరాళాన్ని అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు శొంఠి కిషోర్, రాజులపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉయ్యూరు : కోట్లాదిమంది అత్యంత వైభవంగా జరుపుకునే పండుగ వినాయక చవితి అని టీడీపీ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నా రు. ఉయ్యూరు 15, 17 వార్డులలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో శనివారం రాజేంద్రప్రసాద్ పాల్గొని పూజలుచేసి అన్నసమారాధన ప్రారంభించారు. కొడాలి శరత్, పాలడుగు ప్రసాద్, రాఘవేంద్ర ప్రసాద్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : పెదపులిపాక ఎన్టీఆర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద యువనేత బోడె వెంకట్రామ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నిర్వహించిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు అథారిటీ మెంబరు ముప్పా రాజా, పెనమలూరు జనసేన పార్టీ అధ్యక్షులు మేక సుబ్బారావు, స్వాతితేజ, గ్రామ తెలుగుదేశం నాయకులు మునునూరు నిర్మల్, గూడవల్లి వీరేంద్ర, గోడవల్లి గణేష్, మేకల దినేష్ కుమార్, గొడుగు ప్రదీప్, చాగంటిపాటి రాజేష్, మామిడి గురుమూర్తి, మురారి కృష్ణమూర్తి, సోము సాయిప్రసాద్, పోతినేని నాగార్జున పాల్గొన్నారు.

కంకిపాడు : వినాయక చవితి వేడుకల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు వెంకట్రామ్ అన్నారు. కంకిపాడు భద్రాచలం వారి వీధిలో ఏర్పాటు చేసిన ఘననాథుడి విగ్రహ ఊరేగింపును ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. టీడీపీ నేత తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, చిట్టూరి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్, వణుకూరు విక్రం పాల్గొన్నారు



పెదపులిపాక గణపతి విగ్రహం వద్ద బోడె వెంకట్రామ్ పూజలు

బ్లూఫ్లాగ్ బీచ్‌లకు తక్కువేం కాదు!

- కృష్ణాజిల్లాలో చెంతనే వెలుగు చూడని అద్భుత బీచ్‌లు
- మంగినపూడి బీచ్ కంటే అద్భుతమైన మరో 3 బీచ్‌లు
- పెద్దగొల్లపాలెం, చిన్న గొల్లపాలెం, పెదపట్నం బీచ్‌లు అదరహో
- పరిశుభ్రంగా ఉండే బీచ్‌లపై దృష్టి పెడితే పర్యాటక స్వర్గధామమే
- ఎన్‌హెచ్ - 216 వెంబడి 3 కిలో మీటర్ల దూరంలో సుందర బీచ్‌లు



పాల నురుగులు కక్కే స్వచ్ఛమైన నీరు.. గోధుమ వర్ణపు ఇసుక మేటలు.. సుందరమైన ప్రాంతాలు.. అద్భుతమైన సూర్యాస్తమయపు దృశ్యాలు..! కృష్ణాజిల్లాలో ఆకట్టుకుంటున్న నాలుగు బీచ్‌లు ఇవి! బ్లూఫ్లాగ్ బీచ్‌లకు ఏమీ తక్కువ కాదు! కానీ వీటి గురించి ఎంత మందికి తెలుసు? కృష్ణాజిల్లాలో మంగినపూడి బీచ్ తప్పితే మిగిలిన బీచ్‌ల గురించి తెలిసింది తక్కువే. మంగినపూడి కంటే అద్భుతమైన బీచ్‌లు ఎన్నో ఉన్నాయి. రవాణా సదుపాయాలు కల్పిస్తే చాలు! ఇలాంటి బీచ్‌లను మన పక్కన పెట్టుకుని గోవాకు పరుగులు పెడుతున్నాం. ప్రకృతి వనరులు కలిగిన ఇలాంటి బీచ్‌లు మరెక్కడైనా ఉంటే ఒడిసి పట్టుకుని పర్యాటకంగా అభివృద్ధి చేసుకునేవారు! కృష్ణా జిల్లాలో పర్యాటక స్వర్గధామంగా ఉండే బీచ్‌లు ఏమిటి? అవెక్కడున్నాయి? వాటి ప్రత్యేకత ఏమిటి? అక్కడికి ఎలా వెళ్లాలనే వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.. - ఆంధ్రజ్యోతి, విజయవాడ/కృత్తివెన్ను

కృత్తివెన్ను మండలంలో ఎన్‌హెచ్ - 216 వెంబడి 3 కిలోమీటర్ల దూరంలో చిన్న గొల్లపాలెం బీచ్ ఉంది. దీని ప్రత్యేకత ఏమిటంటే సముద్రంలో దీవి ఉంది. ఇది మానవ నిర్మిత దీవిగా చెప్పుకోవాలి. కొల్లేరు బ్యాక్ వాటర్ ఈ ప్రాంతాన్ని ముంచెత్తుతున్నప్పుడు ఈ ముంపును మళ్లించడానికి వీలుగా స్థానిక ప్రజలు బ్యాక్ వాటర్‌ను సముద్రంలోకి పంపేందుకు కొత్త కాలువను రెక్కల కష్టంతో తవ్వారు. దీంతో బ్యాక్ వాటర్ అంతా కొత్తకాలువ నుంచి సముద్రంలో కలిసేది. కాలక్రమంలో కాలువ వెంబడి సముద్ర తీరానికి అనుకుని దీవి ఏర్పడింది. ఈ దీవికి మూడు వైపులా కొత్త కాలువ మిగిలిన ఒకవైపు సముద్రం ఉంటుంది. ఈ దీవి పొడవు 9 కిలోమీటర్లు, వెడల్పు 5 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. మొత్తం 5వేల ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో కొబ్బరిచెట్లు, సరుగుడు చెట్లు ఇతర పండ్ల చెట్లను రైతులు సాగు చేస్తున్నారు. దీన్ని చిన్న గొల్లపాలెం దీవిగా పేర్కొంటారు. ఈ దీవిని చూస్తే అద్భుత ప్రకృతి ప్రపంచం కనిపిస్తుంది. దీన్ని ఆనుకుని సుందరమైన బీచ్ ఉంటుంది. దీన్ని పెద్దగొల్లపాలెం బీచ్ అంటారు. సువిశాల బీచ్ కంటిని రెప్పార్పనీయకుండా చేస్తుంది. ఈ ప్రాంతం చాలా పరిశుభ్రంగా ఉంటుంది. పర్యాటకులు రావటానికి తేలికైన దారి లేదు. ఇదొక్కటే ఇక్కడి సమస్య!

చిన్న గొల్లపాలెం బీచ్



పెద్ద గొల్లపాలెం బీచ్

చిన గొల్లపాలెం నుంచి 6 కిలోమీటర్ల దూరంలో పెద గొల్లపాలెం బీచ్ ఉంది. స్వచ్ఛమైన బీచ్ ఇది. విస్తీర్ణం 4 కిలోమీటర్లు. ఈ బీచ్ చాలా పరిశుభ్రంగా ఉంటుంది. సాయంత్రాలు చాలామంది యువకులు బైక్‌లు వేసుకుని సముద్రతీరం వెంబడి మెరుపువేగంగా దూసుకుపోతూ ఎంజాయ్ చేస్తుంటారు. ఇక్కడి బీచ్ ఇసుక తిన్నెలతో కూడిన నేల చాలా గట్టిగా ఉంటుంది. బైక్‌లపై సవారీ చేసేవారు స్లిప్ అయి పడిపోరు. మెత్తటి ఇసుక మేటలు కట్టిపడేస్తారు. నీలం రంగున ఆకాశం నయనానందకరంగా ఉంటుంది. సాయంత్రం సూర్యాస్తమసమయాన బీచ్ పలు రంగుల్లో మెరిసిపోతుంది.



పెదపట్నం బీచ్

పెద్ద గొల్లపాలెం బీచ్ తర్వాత 10 కిలోమీటర్ల దూరంలో బందరు మండలం పరిధిలో పెదపట్నం బీచ్ ఉంటుంది. ఈ బీచ్‌కూడా 8 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది. ఈ బీచ్ చాలా సుందరంగా ఉంటుంది. సముద్రం ఈ వైపు ఉధృతంగా ఉంటుంది. గర్జిస్తున్నట్టుగా ఉంటుంది. ఈ ప్రాంతం కూడా ఎంతో పరిశుభ్రంగా ఉంటుంది. పెదపట్నం బీచ్‌కు ఒకసారి వస్తే మళ్లీ మళ్లీ రావాలనిపిస్తుంది. చిన్న గొల్లపాలెం, పెద్ద గొల్లపాలెం, పెదపట్నం బీచ్‌లు వరుసగా ఒకదాని వెంబడి ఒకటి ఉంటాయి. పెదపట్నం బీచ్ తర్వాత మంగినపూడి బీచ్ ఉంటుంది. ఈ బీచ్‌లన్నింటినీ నాలుగు కాల్వలు విడదీస్తాయి. చిన్న, పెద్ద గొల్లపాలెం బీచ్ మధ్య కొత్త కాలువ, పెద్ద గొల్లపాలెం, పెదపట్నం బీచ్ మధ్యన పెద లంక డ్రెయిన్, పెదపట్నం, మంగినపూడి బీచ్‌ల మధ్యన లజ్జబండ డ్రెయిన్ పెదన మీదుగా సముద్రంలో కలుస్తాయి. నాలుగు బీచ్‌లు మూడు కాలువలను కలిపి బీచ్ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయటానికి మంచి అవకాశం ఉంది.

పతాకస్థాయికి చంద్రబాబు కీర్తి

- మాజీ హోంమంత్రి వసంత

నందిగామ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దార్శనిక పాలకుడిగా మీకీర్తి పతాకస్థాయికి చేరిందని, అమరావతి నిర్మాణంతో ఆ కీర్తి చరిత్రలో ప్రత్యేక స్థానం సాధించనుందని మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కొనియాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లయిన సందర్భంగా శుక్రవారం సచివాలయంలో ఆయన చంద్రబాబును కలిశారు. ఇరువురు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. టీడీపీ తొలినాళ్ల అనుభవాలను నెమరవేసుకున్నారు. వసంత ఆరోగ్యంపై చంద్రబాబు ఆరా తీశారు. రాష్ట్ర అభివృద్ధికి మీ వంటి సీనియర్లు సేవ లందించాలన్నారు. బీభత్సం తరువాత నెలకొన్న ప్రశాంతతను ప్రజలు ఇప్పుడు అనుభవిస్తున్నారని వసంత అన్నారు. సుదీర్ఘకాలంగా ఎన్నో ఎదురు దెబ్బలు తిన్నా విధానాలు మార్చుకోకుండా నమ్మిన సిద్ధాంతం కోసం నడిచిన మీ మహోన్నత వ్యక్తిత్వం భావితరాలకు ఆదర్శం కానుందన్నారు. రాష్ట్ర పునః నిర్మాణానికి చేస్తున్న కృషికి ప్రజలు అండగా ఉంటారని వసంత పేర్కొన్నారు.


వసంత నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న సీఎం

సాదియా అల్మాస్‌కు ఘనస్వాగతం

గన్నవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక విమానాశ్రయంలో జూనియర్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన మంగళగిరికి చెందిన షేక్ సాదియా అల్మాస్‌కు ఘనస్వాగతం లభించింది. కోస్టారికా దేశం శాంజోస్‌లో జరిగిన పోటీల అనంతరం శనివారం హైదరాబాద్ మీదుగా మధ్యాహ్నం ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో సాదియా అల్మాస్‌కు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు భాస్కరరావు, సంయుక్త కార్యదరి ఎండీ మస్తాన్‌వలి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎస్‌కే సుభాని, నరసరావుపేట ఎంఐఎం ఇన్‌చార్జి షేక్ మౌలాలీ, ముస్లీం చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుర్, పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వచ్చి స్వాగతం పలికారు. అల్మాస్ పాటు ఆమె తండ్రి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి షేక్ సందానిని ఘనంగా సత్కారించారు. అనంతరం సాదియా మీడియాతో మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, స్పాన్సర్స్ ప్రోత్సాహం వల్లే ఈ ఘనతను సాధించినట్టు తెలిపారు. ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధిస్తానని ఆశాభావం వ్యకం చేశారు.



జూనియర్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన సాదియా అల్మాస్‌కు స్వాగతం పలుకుతున్న అసోసియేషన్ సభ్యులు

సముద్ర చేపలకు భలే డిమాండ్

- మంగినపూడిబీచ్ సమీపంలోని మార్కెట్‌లో సందడి
- చేపల ధరలు ఎక్కువైనా కొనుగోళ్లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: సముద్రంలో సహజసిద్ధంగా పెరిగే చేపలు, రొయ్యలకు ఇటీవల డిమాండ్ పెరుగుతోంది. మంగినపూడి బీచ్ సమీపంలో ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి జరిగే చేపల మార్కెట్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతా నుంచి వచ్చే ప్రజలతో ఈ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంటోంది. ఇక్కడ గురకలు, మాగ రెక్కలు, కోణాలు, వంజనం, పారలు, నెమలికోణాలు, గుడ్లగురకలు, టేకుచేపలు, సొరచేపలు, పులిమచ్చల గురకలు, చందువాలు, సావాడాయిలు, పీతలు, టైగర్ రొయ్యలు, ఎలిరొయ్యలు లభిస్తాయి, చేపలు కిలో రూ.200 నుంచి రూ.400 ధరగా నిర్ణయించి విక్రయిస్తారు. టైగర్‌రొయ్యలు కిలోకు 10 తూగితే రూ.700 నుంచి మార్కెట్‌లో డిమాండ్ కారణంగా రూ.వెయ్యి వరకు విక్రయిస్తారు. ఎలిరొయ్యలు కిలోకు 60 నుంచి 70 తూగితే రూ.300కు విక్రయిస్తారు. సముద్రంలో దొరికే సహజసిద్ధమైన మేతను తినే చేపలు, రొయ్యలను ఆహారంగా తీసుకుంటే కంటి చూపు మెరుగుపడుతుందని, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడేవారికి శరీరానికి పోషకాలు సరిపడా అందుతాయనే కారణంతో ప్రతిరోజు ఇక్కడి మార్కెట్‌కు ప్రజలు వచ్చి చేపలు, రొయ్యలను కొనుగోలు చేస్తుంటారు. శనివారం సైతం చేపలు, రొయ్యల కొనుగోలుకు అధికసంఖ్యలో ప్రజలు తరలి రావడం గమనార్హం.


మంగినపూడి బీచ్ సమీపంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న చేపలు, రొయ్యలు

చేపల వ్యాపారంలో మహిళలదే పైచేయి

మంగినపూడి బీచ్ నుంచి తెల్లవారుజామున చిన్నపాటి పడవల్లో గిరిపురానికి చెందిన మత్స్యకారులు చేపలవేటకు వెళతారు మధ్యాహ్నం నుంచి చేపలవేటను ముగించుకుని తిరిగి వస్తారు. మంగినపూడి బీచ్ సమీపంలో మార్కెట్‌లో చేపలను విక్రయిస్తారు. చేపలవేలం ఒక్కోసారి వేలల్లో ఉంటుంది. ఈ వేలంలో మహిళలే అధికసంఖ్యలో పాల్గొంటారు. చేపల వేలంపాట కనీసంగా రూ.2వేల నుంచి రూ.40 వేలు, అంతకుమించి వెళుతుంది. అప్పటికప్పుడు నగదును చెల్లిస్తారు. ఆ చేపలు, రొయ్యలను చెన్నై, కోల్‌కతా, దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఫైవ్‌స్టార్ హోటళ్లకు పంపుతూ ఉంటారు. కొన్నింటిని స్థానికంగా విక్రయిస్తూ ఉంటారు.


మంత్రి లోకేశ్ ఇంటి ముట్టడికి వచ్చిన ఎస్‌ఎఫ్‌ఐ నేతలు, శ్రేణుల్ని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఉద్రిక్తంగా 'చలో విజయవాడ'

- విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం: ఎస్‌ఎఫ్‌ఐ

ధర్నాచౌక్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన 'చలో విజయవాడ'లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీసెంట్‌రోడ్డు నుంచి స్థానిక ధర్నాచౌక్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా నిర్వహించిన అనంతరం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇంటి ముట్టడికి ప్రయత్నించిన ఎస్‌ఎఫ్‌ఐ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తీవ్ర తోపులాట జరిగింది. ఈ క్రమంలో ముగ్గురు మహిళా నేతలు స్పృహ తప్పగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పలువురు ఎస్‌ఎఫ్‌ఐ నేతలను పోలీసులు అరెస్టు చేసి నగరంలోని పలు స్టేషన్లకు తరలించారు. తొలుత నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యార్థులను నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. విద్యారంగంలో సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నా మంత్రి లోకేశ్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాన్ని అభినందించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పీ రామ్మోహన్, కే ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దూరం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. తక్షణమే రూ.6400 ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, అర్హులైన ప్రతీ విద్యార్థికి తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌జే నాయుడు, కిరణ్, రవి, రాజా పాల్గొన్నారు.

సమన్వయలోపంతో అభివృద్ధికి ఆటంకం

- జడ్పీ సీఈవో కన్నమనాయుడు

పామర్రు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలచేత ఎన్నుకబడిన స్థానిక ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారుల సమన్వయలోపాలతో మండలాల్లో జరగాల్సిన అభివృద్ధి నిధులు నిర్వీర్యం అవుతున్నాయని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కన్నమనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం సాధారణ తనిఖీల్లో భాగంగా విచ్చేశారు. ఈసందర్భంగా పలు అభివృద్ధికి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించి విలేకర్లతో మాట్లాడారు. మండలంలో గడిచిన రెండున్నర ఏళ్ల నుంచి స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులకు మధ్య కొరవడిన సమన్వయలోపంతో అభివృద్ధి పనులు జరగలేదని రికార్డులు స్పష్టం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో జరగాల్సిన రూ.43 లక్షల పనులతోపాటు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.79 లక్షలతో నిర్వహించాల్సిన ఉన్న పనులను నేటికీ ప్రారంభించకపోవడం గుర్తించామన్నారు. జనరల్ బడ్జెట్ అవసరం మేరకు ఉన్నప్పటికీ పనులు ఎందుకు ప్రారంభించలేదని ఎంపీడీవోను, పీఈఆర్‌ఏఈని నివేదిక రూపంలో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కొందరు ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ సమావేశాలకు గైర్హాజరైనట్టు స్పష్టమవుతోందన్నారు. కృష్ణాజిల్లాకు డిప్యూటీ ఎంపీడీవోలకు పదోన్నతులపై 10 మంది ఎంపీడీవోలను కేటాయించినట్లు చెప్పారు. వారికి వచ్చేవారంలో మండలాలను నియమించడం జరుగుతుందన్నారు. అలాగే జిల్లాలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ముగ్గురు ఎంపీడీవోలకు డీఎల్‌డీవోలుగా పదోన్నతులు వచ్చాయన్నారు. వారిని త్వరలోనే రిలీవ్ చేయడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో కాంద్రుజ్యోతి పాల్గొన్నారు.


పామర్రు ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న సీఈవో కన్నమనాయుడు

వర్సిటీల్లో పోస్టులను భర్తీ చేయాలి

- గవర్నర్‌కు మాజీ ఎమ్మెల్సీ వినతి

గవర్నర్‌పేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వర్సిటీల్లో ఖాళీగా ఉన్న 4500 టీచింగ్ పోస్టులను భర్తీ చేయడానికి చాన్సలర్ హోదాలో చొరవ చూపాలని శనివారం మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి మెమొరాండం అందజేశారు. కేంద్రం విడుదల చేసిన మెమో నెంబరు 57ను అమలు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను సీపీఎస్ నుంచి ఓపీఎస్ పరిధిలోకి తేవాలని కోరారు.జీవో నెంబరు 114 అమలు చేసి కాంట్రాక్టు అధ్యాపకులను, ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలని గవర్నర్‌ను కోరారు.


అత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో శిక్షణార్థులతో ముచ్చటిస్తున్న భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

భవిష్యత్ చోదకశక్తులుగా యువత ఎదగాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉంగుటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాన్ని అందిపుచ్చుకుని ఉద్యోగార్థులుగా కాకుండా శక్తివంతమైన భవిష్యత్ చోదకశక్తులుగా యువత ఎదగాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ (విజయవాడ చాప్టర్)లో శనివారం ఉదయం పచ్చని ప్రకృతిలో నడిచిన ఆయన అక్కడ శిక్షణార్థులతో కలిసి యోగ, వ్యాయామం చేశారు. ఈసందర్భంగా కొద్దిసేపు యువతతో ముచ్చటించి వారి ఆలోచనలు తెలుసుకుని, పలు సూచనలు చేశారు. ప్రావీణ్యాలు, నైపుణ్యాలు మెరుగుపరచుకున్న యువత ఏ రంగంలోనైనా అద్భుతంగా రాణించగలదన్నారు. యువత భుజస్కంధాలపై దేశభవిష్యత్తు ఆధారపడి ఉందన్న ఆయన వ్యక్తుల ప్రతిభాపాటవాలు, నైపుణ్యాలే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించగలవని విశ్వాసం వ్యక్తం చేశారు.

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వన్‌స్టాప్ సెంటర్ (విజయవాడ)లో అడ్మినిస్ట్రేటర్ ఒక పోస్ట్, సైకో సోషల్ కౌన్సెలర్ ఒక పోస్టు భర్తీకి గతేడాది అక్టోబరు 16న నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించామని, అందులో ఎవరూ అర్హత సాధించనందున తిరిగి నోటిఫికేషన్ జారీ చేసినట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు లేదా ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసేందుకు స్థానిక అర్హులైన 18 నుంచి 42 ఏళ్ల వయసున్న మహిళా అభ్యర్థులు నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ మహిళలకు 5ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల గరిష్ఠ వయస్సులో సడలింపు ఉంటుందన్నారు. సెప్టెంబరు 9 వరకు ఆసక్తిగల స్థానిక మహిళా అభ్యర్థులు ఎన్టీఆర్.ఏపీ.జీఓవీ.ఇన్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిచేసి, ధ్రువీకరణ పత్రాల నకళ్లను గజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయించి, ఆ దరఖాస్తులను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి వారి కార్యాలయం, డోర్ నెంబరు 31-4-29/ఎ, గద్దె పూర్ణచంద్రరావు వీధి, మారుతీనగర్ 2వ లైను, విజయవాడ కార్యాలయంలో స్వయంగా సమర్పించాలన్నారు.


స్వామివారికి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే దంపతులు

వైభవంగా స్వామివారి శాంతి కల్యాణం

- కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

ఘంటసాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో వేంచేసి ఉన్న శ్రీ కాకుళేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. విశేషంగా అలంకరించిన దేవాలయ ముఖ మండపంలో కల్యాణమూర్తులను ఉంచి వేదపండితులు అగ్నిహోత్రం భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాంతి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి శాంతి కల్యాణానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తొలుత విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచనం, పవిత్ర విసర్జన, మహాపూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శాంతి కల్యాణానికి విచ్చేసిన ఎమ్మెల్యే దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందించారు. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఈ వేడుకలను పర్యవేక్షించారు. ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), కుంపటి చిట్టిబాబు, శీలం శ్రీనివాస్, దాసం రామకృష్ణ, కొండవీటి నాని, కోటి, వినయ్, శ్రీను పాల్గొన్నారు.

విజయవంతంగా గణేశ్ ఉత్సవాలు

- ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు గోకరాజు గంగరాజు

లబ్బీపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గణేష్ ఉత్సవాలు నిర్వహణలో ప్రభుత్వ సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్టు ఆంధ్రప్రదేశ్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు గోకరాజు గంగరాజు తెలిపారు. బందర్ రోడ్డులోని గ్రాండ్ మినర్వా హోటల్‌లో శనివారం సమితి అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ సమితి పురోగతి వివరాలతో రూపొందించిన పుస్తకాన్ని సమితి పెద్దలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడు లేనివిధంగా సింగిల్ విండో పద్ధతి ద్వారా ఎలాంటి రుసుములు లేకుండా, ఉచిత విద్యుత్ సౌకర్యం అందించి సమన్వయంతో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఉత్సవాల్లో పలు చోట్ల ప్రమాదవశాత్తు చనిపోయిన 11 మంది కుటుంబాల్లో ప్రతి కుటుంబానికి రూ.50వేలు ఆర్థికసహాయం అందజేయాలని నిర్ణయంచామన్నారు. వారికి త్వరలోనే ఆయా జిల్లాల సమితి సభ్యులు అందజేస్తారని, ఉత్సవాల విజయవంతంలో సహకరించిన ప్రభుత్వానికి, అధికారులకు, సమితి సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ రంగ ప్రసాద్, బీవీ రమణ కుమార్, కార్యదర్శులు దుర్గా ప్రసాద్ రాజు, వేణుగోపాల్, కుమారస్వామి, రమణ పాల్గొన్నారు.

మారణాయుధాలతో డ్యాన్స్

- గణేష్ నిమజ్జనంలో ఒక వర్గాన్ని రెచ్చగొట్టేలా అలజడి
- చూస్తూ ఊరుకున్న పోలీసులు
- భయాందోళనలో గ్రామస్థులు

వీరులపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అసలే నరసింహారావుపాలెం గ్రామం సమస్యాత్మకమైంది. అలాంటి గ్రామంలో శుక్రవారం గణేష్ నిమజ్జనంలో ఒక వర్గం వారు మరోవర్గాన్ని రెచ్చగొట్టేలా మారణాయుధాలు చేత పట్టుకొని గ్రామోత్సవం చేయడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. నిమజ్జనాలు పోలీసుల ప్రహారాలో జరుగుతున్నా ఇలాంటి ఘటన జరగడం పోలీసులు చూస్తూ ఊరుకోవడం విమర్శలకు తావిస్తోంది. గ్రామంలో ఒక వర్గం వారు వింత పోకడలకు తెరలేపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి వింత చేష్టలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


చేతిలో పెద్ద కత్తి పటుకుని ఒక వ్యక్తిపై ఎక్కి డ్యాన్స్ చేస్తున్న మరో వ్యక్తి

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

నేడు గుడ్లవల్లేరులో తాగునీటి సరఫరా నిలిపివేత

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రక్షిత తాగునీటి పథకం పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆదివారం గుడ్లవల్లేరులో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు. ప్రజలు తాగునీటి కోసం ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకొని సహకరించాలని ఆయన కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

గుడివాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏరియా ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందిన అనాథ వృద్ధురాలి మృతదేహానికి శనివారం బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ (ఆర్.కె) బృందం అంత్యక్రియలు నిర్వహించింది. ఇప్పటి వరకు 138 అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం భగవంతుడిచ్చిన శక్తితో సాధ్యమైందని రామకృష్ణ తెలిపారు. అత్తలూరి రవికిరణ్, గాదె చరణ్ పాల్గొన్నారు.


శ్రీదేవిశరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ప్రజలందరికీ కనకదుర్గమ్మ ఆశీస్సులు

గుడివాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. భీమేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాల ఆహ్వాన పత్రికలను రాజేంద్రనగర్‌లోని స్వగృహంలో ఆయన ఆవిష్కరించారు. ఉత్సవ ఏర్పాట్లకు తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు, వేదపండితులు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



జాబ్‌మేళా ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

పామర్రు,సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అందివచ్చిన ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమెల్యే కుమార్ రాజా అన్నారు. కురుమద్దాలి స్కిల్ డెవలప్‌మెంటు కేంద్రంలో శనివారం నియోజకవర్గ స్థాయి జాబ్ మేళాను జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబుతో కలిసి ప్రారంభించారు. నిరుద్యోగ యువతకు ఉద్యో గ, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. జిల్లా జాబ్స్ మేనేజర్ పి.నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మేళాకు నవత ట్రాన్స్‌పోర్టు, జోయలుక్కాస్, బంధన్ బ్యాంకు, మెడిప్లస్, వరణ్ మోటార్స్ ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు 145 మంది నిరుద్యోగుల్లో 50 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కురుమద్దాలి గ్రామసర్పంచ్ గోట్రు విజయభారతి తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, స్వామివారి లడ్డూలను వేలం పాటలో దక్కించుకున్న భక్తులు


నిమజ్జనోత్సవంలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం

గుడివాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జనోత్సవం శనివారం వైభవంగా జరిగింది. విఘ్నేశ్వరస్వామి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో, మార్కెట్ సెంటర్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, బాలగణపతి దేవస్థానం కమిటీల ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవం భక్తిశ్రద్ధలతో జరిపారు. శ్రీరాంపురంలోని బాలగణపతి స్వామిని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపులో కేరళ, తీన్మార్ వాయిద్యాలు, తమిళనాడు విచిత్ర వేషాలు ఆకట్టుకున్నాయి. శక్తి విన్యాసాలు ఊరేగింపులో హైలెట్‌గా నిలిచాయి.

లడ్డూ ప్రసాదం రూ.2.15 లక్షలు

విఘ్నేశ్వరస్వామి ఆరు ఉత్సవ లడ్డూలు, వంద రూపాయల కరెన్సీ నోట్ల దండకు వేలంపాట నిర్వహించగా భక్తులు రూ.2,15,881 దక్కించుకున్నారు. ప్రధానంగా ఉత్సవాల తొమ్మిది రోజులు విఘ్నేశ్వర స్వామి వారి చేతిలోని రెండు కిలోల ఉత్సవ లడ్డూను కోనేరు హేమంత్, ప్రశాంతి దంపతులు రూ.1.15 లక్షలకు దక్కించుకున్నారు. మెయిన్‌రోడ్డు విఘ్నేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ శాయన రాజేష్ ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాట నిర్వహించారు. మొదటి లడ్డూను గుడివాడ మండలం వలివర్తిపాడుకు చెందిన ప్రాసంగి మనోజ్, రెండో లడ్డూను శాయన గాంధీ, మూడో లడ్డూను గేదెల కల్యాణి, నాలుగో లడ్డూను జొన్నల శోభన్, ఐదో లడ్డూను సింహాద్రి రాంబాబు దక్కించుకున్నారు.

దొండపాడు లడ్డూ రూ.34,100

గుడివాడ రూరల్ : దొండపాడు భారీ గణనాథుని పందిరిలోని లడ్డూకు వేలం పాట నిర్వహించగా దొండపాడు పీఏసీఎస్ కార్యదర్శ నాగమల్లేశ్వరరావు రూ. 34,100లకు దక్కించుకున్నారు. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ గణనాథుని లడ్డూ దక్కించుకోవటం సంతోషంగా ఉందని తెలిపారు.




గుడివాడ నిమజ్జన ఊరేగింపులో కళాకారుల విన్యాసాలు


యద్దనపూడిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

కోసూరు, యద్దనపూడిలో..

కూచిపూడి : కోసూరు, యద్దనపూడి గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజలు, అన్నసమారాధన కార్యక్రమాల్లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. మేళతాళాలు, డప్పువిన్యాసాల నడుమ అత్యంత వైభవంగా నిమజ్జన వేడుకలు జరిగాయి. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, పామర్రు జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, దేవినేని రమేష్ పాల్గొన్నారు.

ఐకమత్యానికి ప్రతీక చవితి వేడుకలు

పామర్రు : లోక కళ్యాణార్థం గ్రామాల్లో నిర్వహించే గణపతి నవరాత్రులు ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు.గణపతి నవరాత్రులను పురస్కరించుకుని పామర్రు పరిధిలోని వివిధ ప్రదేశాల్లో నిర్వాహకులు ఏర్పాటుచేసిన గణనాధునుల విగ్రహాల నిమజ్జనోత్సవం శనివారం అట్టహాసంగా నిర్వహించారు. పాత రిజిస్ట్రార్ కార్యాలయం వీధి, రెండో గ్రామ సచివాలయ సమీపంలోని జమ్మిచెట్టు బజారు, 18వ వార్డులో గణనాథుని విగ్రహ నిమజ్జనోత్సవాన్ని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తో కలసి ప్రారంభించారు. కొండిపర్రు రోడ్డు పుల్లేటిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. రాపర్ల, కనుమూరు గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం సందడిగా జరిగింది. శాలివాహన సంఘ ఆధ్వర్యంలో జరిగిన అన్నదానంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. టీమ్ గజానన చైర్మన్ సత్యసాయితేజశ్రీనివాస్, బాల వెంకటపూర్ణేష్, గాత్రిక్, జస్వంత్. బండి సత్యసుధా సాయి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్సై రాజేంద్రప్రసాద్, సత్యకళ పోలీసు బందోబస్తు నిర్వహించారు.



తాడంకి రామాలయ నిర్మాణానికి ఎన్నారై రూ.2.20 లక్షల విరాళం

పమిడిముక్కల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాడంకి సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు చలపాటి వెంకట గిరిబాబు రూ. 2. 20 లక్షల విరాళం అందజేశారు. ఆస్ట్రేలియాలో స్థిపర పడిన వెంకట గిరిబాబు బంధువులు, స్నేహితుల ద్వారా శనివారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. గ్రామ సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారావు, నాగేశ్వరరావు, చలపాటి సుబ్బారావు, గంగాధర్, శ్రీనివాసరావు, సురేశ్ తదితరులు అభినందనలు తెలిపారు.


ఐనంపూడి రైతు సేవా కేంద్రం, చినముత్తేవి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు / గుడివాడలో తనిఖీ చేస్తున్న ఏడీఏ కవిత

యూరియా వస్తోంది.. ఆందోళన వద్దు

పమిడిముక్కల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైన యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రెండు రోజుల్లో మండల పరిధిలో పీఏసీఎస్‌లకు తగినన్ని యూరియా లోడులు వసున్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని గన్నవరం ఏడీఏ సునీల్ తెలిపారు. ఐనంపూడి రైతు సహాయ కేంద్రానికి శనివారం 15 టన్నుల యూరియా రాగా ఎకరాకు అర కట్ట చొప్పున రైతులకు పంపిణీ చేశారు. మండల పరిధిలో అన్ని పీఏసీఎస్‌లకు 15 నుంచి 20 టన్నుల వరకు యూరియా వస్తుందని తెలిపారు. రైతులకు అవసరమైన మేర యూరియా పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి గణేశ్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది యూరియా పంపిణీ చేశారు. యూరియా పంపిణీని తహసీల్దార్ నవీన్ కుమార్‌పరిశీలించారు.

మొవ్వ మండలంలో బారులు తీరిన రైతులు

కూచిపూడి : మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో యూరియా కోసం రైతులు బారులు తీరారు. వ్యవసాయ అధికారుల సమక్షంలో పోలీసుల బందోబస్తు నడుమ యూరియా పంపిణీకి శ్రీకారం చుట్టారు. చినముత్తేవి పీఏసీఎస్ వద్ద 15 టన్నులు, మొవ్వలో 12 టన్నులు, కాజ, అయ్యంకి, మొవ్వ మొవ్వపాలెం, కోసూరు గ్రామాలకు 10 టన్నుల చొప్పున మొత్తం 77 టన్నుల యూరియా ఎకరాకు అరకట్ట చొప్పున గరిష్ఠంగా రెండు కట్టలు రైతులకు అందించారు. స్వల్ప సం ఘటనలు మినహాయించి ప్రశాంతంగా యూరియా పంపిణీ జరిగింది. ఏడీఏ శ్యామల, తహసీల్దార్ మస్తాన్, ఏవో సురేష్ బాబు నాయక్, వీఏఏలు మహంతి, రత్నకుమారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుమార్‌రాజా పరిశీలన

పామర్రు : ప్రస్తుత ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియా అందిస్తామని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. స్థానిక పీఏసీఎస్ వద్ద యూరియా పంపిణీని ఆయన పరిశీలించారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతుకు ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా జరిగేలా కలెక్టర్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఎఎంసీ చైర్మన్ జన్ను శోభనబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ

గుడివాడ రూరల్ : ఎరువులు, పురుగుల మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ ఎస్.కవిత అన్నారు. శనివారం గుడివాడ మండలంలోని ఎరువుల షాపులను ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఏవో బోలెం అనంతలక్ష్మీ తనిఖీల్లో పాల్గొన్నారు. ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం శనివారం ఉదయం చౌటపల్లిలో యూరియా పంపిణీని ఆయన పరిశీలించారు. రైతులకు సక్రమంగా అందిస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏడీఏ, ఏవో ఉన్నారు. తట్టివర్రులో రైతులకు యూరియా స్లిప్పులు ఏ విధంగా రాస్తున్నది వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది యూరియా సరిగా రాస్తున్నారా? లేదా అడిగి తెలుసుకున్నారు. రైతులతో సక్రమంగా మాట్లాడాలని సూచించారు.

ఎరువుల సీజ్

కూచిపూడి : మొవ్వలోని కనకదుర్గ ఫెర్టిలైజర్స్ దుకాణాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రికార్డుల్లో చూపిన నిల్వలు, వాస్తవ నిల్వల్లో తేడాలు ఉన్నట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా రూ.1,70,240 విలువ గల ఎరువులను సీజ్ చేసినట్లు ఏవో సురేష్‌బాబు నాయక్ తెలిపారు. విజిలెన్స్ సీఐ ఎండి.ఉమర్, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.



ట్రంప్ సుంకాలను నిరసిస్తూ వామపక్షాల ధర్నా

గుడివాడ రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత ఉత్పత్తులపై ఆమెరికా 50 శాతం దిగుమతి సుంకాలను నిరసిస్తూ ప్రజలు ఉద్యమాలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందని వామపక్ష నాయకులు ఆర్సీపీ రెడ్డి, చింతలూరి సత్యనారాయణ అన్నారు. భారత్‌పై ట్రంప్ సుంకాలు విధించడాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో గుడివాడ మార్కెట్ యార్డు వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఆమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై పెత్తనం చేస్తుంటే ప్రధాని మోదీ నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. కార్పొరేట్ శక్తులకు లక్షలాది కోట్ల రూపాయలు రాయితీలిస్తున్న మోదీ, సామాన్యులపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. వామపక్ష నాయకులు లంకా సురేంద్ర, పి.రజిని, డి.నరసింహారావు, పద్మారావు, శ్రీనివాసు, అప్పలనాయుడు, కృష్ణ, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి జడ్పీ పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కూచిపూడి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి జడ్పీ పాఠశాలకు గ్రామానికి చెందిన ప్రశాంత్ యేలేశ్వరపు మిత్ర బృందం భాను ప్రసాద్, అనిల్ కుమార్ బొడ్డు, వెంకట్ బండారు రూ.50 వేల విలువ గల కంప్యూటర్‌ను శనివారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, పాఠశాల విద్యాకుటుంబం దాతలకు అభినందనలు తెలిపింది.

పామర్రు, మొవ్వలో సచివాలయ ఉద్యోగుల నిరసన

పామర్రు,సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసిన ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని గ్రామ సచివాలయ ఉద్యోగుల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. పామర్రులో సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడుకు వినతి పత్రం అందజేశారు. వనిత, తనూజ, పూజ, తిరుమల, నరేష్, నవీన్, శ్రీపవన్ తదితరులు పాల్గొన్నారు. **కూచిపూడి** : సచివాలయ ఉద్యోగులను ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లకు మ్యాప్ చేసి బలవంతంగా విధులు అప్పగిస్తున్న తీరుకు నిరసనగా మొవ్వ సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులు మూకుమ్మడిగా బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంకల్ప విషయాలపై బాలికలకు అవగాహన

పమిడిముక్కల : ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు సంకల్ప విషయాలపై శనివారం అవగాహ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు మాట్లాడుతూ లింగ వివక్షత విడనాడాలని, లైంగిక వేధింపుల నుంచి ఆత్మరక్షణ కు కరాటే వంటి విద్యలు నేర్చు కోవాలని సూచించారు. బాలికలు సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టిహారం తీసుకోవాలని, రుతుస్రావ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి అబ్దుల్ నబీ మున్నీ అన్నారు. పోక్సో చట్టం లక్ష్యాలు, ప్రయోజనాలు వివరించారు. దేవరపల్లి ఆశాలత, అఖిలవాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

11, 12 తేదీల్లో జిల్లాలో చేనేత అధ్యయన యాత్ర

పెడన, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11, 12 తేదీల్లో జిల్లాలో చేనేత అధ్యయన యాత్ర నిర్వహిస్తున్నామని చేనేత కార్మిక సంఘం(సీపీఐ కార్మిక అనుబంధ సంస్థ) జిల్లా అధ్యక్షుడు కోదాటి నారాయణరావు తెలిపారు. సర్వోదయ చేనేత సొసైటీలో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికుల సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. యాత్రను ఈనెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రారంభిస్తారని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కట్టా హేమసుందరరావు తెలిపారు. పెడన, కప్పలదొడ్డి, పోలవరం, ఐదుగుళ్లపల్లి, మల్లవోలు, రాయవరం, కాజ, ఘంటసాల, చల్లపల్లిలో యాత్ర కొనసాగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు పేరిశెట్టి ఉమాకాంతం తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



మణిమేశ్వరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'అభివృద్ధి పథాన రాష్ట్రం పయనిస్తోంది. గతంలో అనేక పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వంపై నమ్మకంతో అనేక పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది.' అని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మణిమేశ్వరంలో రూ.43.6 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.24 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, జలజీవన్ పథకం ద్వారా రూ.58 లక్షలతో నిర్మించిన నీటి సంపును శనివారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ దింటకుర్తి ధనలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసీరావు, పీఏసీఎస్ చైర్మన్ లీలాకృష్ణ, డీసీ చైర్మన్ కాశీ, లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి అంగర రంగనాథ్, పర్ణం సూర్య ప్రకాశరావు, బండారు నాగచంద్ర, నూర్, కేశవ, తాతారాజా, చిన్నా, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం అర్తమూరుకు చెందిన పోలగాని నాని కుమారుడి వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.4.96 లక్షల చెక్కును ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందజేశారు.

మహిళలు రాజకీయంగా ఎదగాలి

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న పైడిపాముల స్వప్న దంపతులు

అవనిగడ్డ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలు రాజకీయంగా ఎదగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టరుగా ఇటీవల నియమితురాలైన చల్లపల్లి ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న దంపతులు శనివారం బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక పాల్గొన్నారు.



కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన పైడిపాముల కృష్ణకుమారి, స్వప్న, బోలెం నాగమణిని సత్కరిస్తున్న కనపర్తి శ్రీనివాసరావు

పార్టీకి, ప్రజలకు మెరుగైన సేవలందించండి

● కార్పొరేషన్ డైరెక్టర్లకు టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు సూచన

అవనిగడ్డ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్టీకి, ప్రజలకు మెరుగైన సేవలందించాలని కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన నియోజకవర్గానికి చెందిన ముగ్గురు మహిళా నేతలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు సూచించారు. నూతనంగా నియమితులైన ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడిపాముల కృష్ణకుమారి, నాటక అకాడమీ డైరెక్టర్ పైడిపాముల స్వప్న, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి శనివారం టీడీపీ కార్యాలయంలో కనపర్తిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నూతన డైరెక్టర్లను ఆయన సత్కరించారు.

స్కూల్ గేమ్స్‌లో యోగాకు ప్రాధాన్యత కల్పించాం

● డీఈవో పీవీజే రామారావు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మండల, డివిజన్, జిల్లా స్థాయిలో నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో యోగాకు కూడా ప్రాధాన్యత కల్పించామని డీఈవో పి.వి.జె.రామారావు తెలిపారు. శనివారం డీఈవో కార్యాలయంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శుల ఎన్నిక నిర్వహించారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పెదఅవుటపల్లి హైస్కూల్ పీడీ రాంబాబు, గూడూరు హైస్కూల్ పీడీ ఎం.అరుణ కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని డీఈవో సత్కరించారు.

వద్దన్న వారికి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇచ్చారు

● బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడు ఏఆర్కే మూర్తి ఆగ్రహం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'జిల్లా ప్రధాన కేంద్రమైన మచిలీపట్నానికి బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పదవి రాకపోవడంపై బ్రాహ్మణులు అసంతృప్తితో ఉన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి వద్దన్న గుడివాడకు చెందిన ఆర్ఎస్ వరప్రసాద్‌కు బలవంతంగా అంటకట్టారు. ఎన్నికల్లో కేసులు పెట్టించుకుని పార్టీ కోసం కష్టపడిన పి.వి. ఫణికుమార్‌కు ఇవ్వలేదు. మంత్రి కొల్లు రవీంద్ర సిఫార్సు చేసిన లేఖను పక్కనపెట్టారు.' అని బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడు డాక్టర్ ఏఆర్కే మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశాఉ. శనివారం భాస్కరపురంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు బ్రాహ్మణులు విశేష కృషి చేశారన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నోబుల్ కళాశాలలో 1973-78 సంవత్సరాల్లో ఇంటర్, బీఎస్సీ చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం కళాశాల సమావేశపు హాలులో నిర్వహించారు. ప్రిన్సిపాల్ జె.ఎర్నెస్ట్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి కళాశాలగా పేరొందిన నోబుల్ కళాశాలలో ఎందరో మహనీయులు విద్యాభ్యాసం చేశారన్నారు. తిరిగి కళాశాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు పూర్వ విద్యార్థులు సహకరించాలన్నారు. నోబుల్ కళాశాల రిటైర్డు లెక్చరర్ ఎం.జాషువా, సిండికేట్ బ్యాంక్ రిటైర్డు డీజీఎం విశ్వనాథ్, యూనియన్ బ్యాంక్ రిటైర్డు ఏజీఎం విజయప్రతాప్, ఎస్ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ గ్లేవియర్, రిటైర్డు ఎంఈవో ఇ.జాన్ శామ్యూల్ ప్రసంగించారు.

లక్ష్మీ పెరుమాళ్లు కుటుంబానికి పరామర్శ

కోడూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య ప్రార్థనా మందిరం గౌరవ అధ్యక్షుడు అన్నం లక్ష్మీ పెరుమాళ్లు శుక్రవారం మృతిచెందారు. శనివారం కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. చిత్రపటానికి నివాళులర్పించారు. ఆర్యవైశ్య ప్రముఖులు బూరగడ్డ హరనాథ్ బాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు మర్రె గంగయ్య, పూతబోయిన కరుణ కుమార్, కోట రాంబాబు, పూతబోయిన సీతారత్నసాయిబాబు పాల్గొన్నారు.

బొబ్బా గోవర్ధన్‌కు సత్కారం

అవనిగడ్డ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్‌ను నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నేతలు ఘనంగా సత్కరించారు. విజయవాడలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన జాతీయ కార్యవర్గ సమావేశంలో యూనియన్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్ శర్మ, నారాయణ్ తివారీలు గోవర్ధన్‌ను సన్మానించారు. సమాజంలో జర్నలిస్టులు పోషిస్తున్న పాత్రపై గోవర్ధన్ ప్రసంగించారు.



శ్రీకాకుళం పీఏసీఎస్ వద్ద యూరియా పంపిణీ చేస్తున్న ఏడీఏ శ్యామల సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్



విశ్వనాథపల్లి పీఏసీఎస్‌లో పంపిణీ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు



బంటుమిల్లిలో యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

రైతులకు యూరియా పంపిణీ

ఘంటసాల/కోడూరు/అవనిగడ్డ/బంటుమిల్లి/పెడన రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌ల వద్ద శనివారం రైతులకు యూరియాను పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా యూరియా కొరత ఉన్నప్పటికీ కేంద్రంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షంగా ఉండడంతో కూటమి ప్రభుత్వం ప్రణాళికతో యూరియా సరఫరా చేస్తోందని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. కోడూరు మండలం విశ్వనాథపల్లి పీఏసీఎస్‌లో రైతులకు ఆయన యూరియా పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ తోట సాంబశివరావు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట వెంకట సూర్యనరసింహారావు పాల్గొన్నారు. రైతులు యూరియాను నిల్వ పెట్టుకోవద్దని, సరఫరా అవుతూనే ఉంటుందని ఏవో ఎం.శ్రీధర్ తెలిపారు. కోడూరు పీఏసీఎస్‌కు 330 బస్తాల యూరియా వచ్చిందని రైతుకు ఒక్కొక్క బస్తా చొప్పున అందిస్తున్నామని ఆయన తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు పూతబోయిన కరుణ కుమార్, సభ్యులు పాల్గొన్నారు. ఘంటసాల మండలంలోని రైతులందరికీ యూరియాను అందిస్తామని మొవ్వ వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.శ్యామల తెలిపారు. శ్రీకాకుళం పీఏసీఎస్ వద్ద రైతులకు తహసీల్దార్ విజయప్రసాద్, సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్‌తో కలిసి ఆమె యూరియా పంపిణీ చేశారు. శ్రీకాకుళం పీఏసీఎస్‌లో 17.705 టన్నులు, శ్రీకాకుళంలోని వెంకట పద్మావతి ఎరువుల షాపులో 19.935 టన్నులు, కొడాలిలోని ధనుష్ ఎరువుల షాపులో 19.008 టన్నులు మొత్తం 54.81 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని తెలిపారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు రెండు కట్టలు, రెండు ఎకరాలకు ఒక కట్ట, ఐదు ఎకరాలు పైబడిన వారికి 3 కట్టల చొప్పున పంపిణీ చేస్తున్నామని ఏడీఏ తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ తిరుమలశెట్టి రాంబాబు, ఎస్సై ప్రతాప్‌రెడ్డి, వీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు. అవనిగడ్డలో నిర్వహించిన యూరియా పంపిణీలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఏడీఏ జయప్రద, పీఏసీఎస్ చైర్మన్ మాదివాడ రత్నారావు, దివి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజనాల మాణిక్యాలరావు, పీఏసీఎస్ సభ్యులు కమ్మిలి మారిబాబు, భోగాది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెడన నియోజకవర్గంలో..

పెడన మండలంలో 215 టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఏవో నజ్మా జన్నీ తెలిపారు. కవిపురం, చేవేంద్ర, పెడన, కొంకేపూడి, నందమూరు, పెనుమల్లి, ముచ్చర్ల, నందిగం, దావోజిపాలెంలో సహకార సంఘాల ద్వారా అందించామన్నారు. బంటుమిల్లి మండలంలో బంటుమిల్లి, పెందుర్రు, ముల్లపర్రు, మలపరాజుగూడెం, ఆముదాలపల్లి, మల్లేశ్వరం, కొర్లపాడు, అర్తమూరు, ముంజులూరు గ్రామాల్లో అధికారుల సమక్షంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.పూర్ణచంద్రరావు, ఆర్ఐ బత్తుల శివశంకర్, ఏడీఏ ఎన్.రమాదేవి, ఎస్సై గణేష్‌కుమార్, సహకార బ్యాంకు కార్యదర్శి ఎ.ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



అశ్వారావుపాలెంలో బారులు తీరిన మహిళలు

అవనిగడ్డ రూరల్: అశ్వారావుపాలెంలో యూరియా పంపిణీ చేశారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు మధ్య పంపిణీ చేశారు. మనిషికి కట్ట యూరియానే ఇచ్చారు. మహిళలు పట్టాదారు పాస్‌పుస్తకాలు చేతిలో పట్టుకుని మూడు గంటలపాటు క్యూ లైన్‌లో నిలబడ్డారు.

మంగళాపురంలో..



అధికారులు ఏర్పాటు చేసిన షామియానా కింద కుర్చీల్లో కూర్చున్న మంగళాపురం రైతులు

చల్లపల్లి: మంగళాపురం గ్రామంలో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడకుండా మన గ్రోమోర్ సెంటర్ ద్వారా యూరియాను పంపిణీ చేశారు. శనివారం 15.075 టన్నుల యూరియా రాగా, ప్రతి రైతుకు బస్తా యూరియా చొప్పున మధ్యాహ్నం నుంచి పంపిణీ చేశారు. చల్లపల్లి ఏవో కె.మురళీకృష్ణ పర్యవేక్షించారు. సొసైటీ సీఈవో చంద్ర రవికుమార్, పోలీసు, రెవెన్యూ, మన గ్రోమోర్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు..సరఫరా పెంచుతున్నారు: ఏవో

యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని సొసైటీలు, ప్రైవేటు దుకాణాల ద్వారా యూరియా సరఫరా పెంచుతున్నారని ఏవో మురళీకృష్ణ తెలిపారు. సొసైటీ, మన గ్రోమోర్‌కు యూరియా కోసం ప్రతిపాదనలు పంపగా, మన గ్రోమోర్‌కు కేటాయింపులు జరిగాయని, లోడు మంగళాపురం వచ్చేవరకూ లారీ డ్రైవర్ తెలియపరచలేదని, వచ్చాక హమాలీలను ఏర్పాటుచేసుకుని అన్‌లోడ్ చేసుకోవాల్సి వచ్చిందని ఏవో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి యూరియా పంపిణీ జరుగుతుందని రైతుల కోసం షామియానా, కుర్చీలు ఏర్పాటుచేసి తాగునీటి సౌకర్యం కల్పించామని ఆయన తెలిపారు.

ఈలచెట్లదిబ్బకు సాగునీరు అందించాలి

● రాజు కాలువ నుంచి వచ్చే బోదెకు అడ్డుకట్ట తొలగించాలి ● రైతుల డిమాండ్





కాలువ నుంచి వచ్చే బోదెకు వేసిన అడ్డుకట్ట, రాజు కాల్వ వద్ద ఈలచెట్లదిబ్బ ఎత్తిపోతల పథకం

నాగాయలంక, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈలచెట్లదిబ్బ ఎత్తిపోతల పథకం ద్వారా ఖరీఫ్ సాగుకు తక్షణమే నీరును అందించాలని ప్రభుత్వాన్ని ఈలచెట్లదిబ్బ గ్రామ రైతులు కోరుతున్నారు. అదునుపోతే నీరిచ్చినా ఫలితం ఉండదని అంటున్నారు. ఈలచెట్లదిబ్బలోని ఎత్తిపోతల పథకానికి బాపట్ల జిల్లాలోని రాజు కాలువ నుంచి సాగునీరు రాకుండా సమీపంలో ఉన్న లంకేవానిదిబ్బ గ్రామస్థులు అడ్డుకుంటున్నారని ఈలచెట్లదిబ్బ రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని దీవి ప్రాంతం, మత్స్యకార గ్రామమైన ఈలచెట్లదిబ్బకు మూడున్నర దశాబ్దాల క్రితం బాపట్ల జిల్లాలోని రాజుకాల్వ వద్ద నున్న ఈలచెట్లదిబ్బ ఎత్తిపోతల పథకం నుంచి కృష్ణానదిలో పైపుల ద్వారా గ్రామస్థులకు తాగునీరు, రైతులకు సాగునీరును అందిస్తున్నారు. 700 ఎకరాల్లో రైతులు వరిని సాగు చేస్తున్నారు. ఈ గ్రామంలోని రైతులే ఎకరాకు కొంత సొమ్మును వసూలు చేసి ఆ పథకాన్ని స్వయంగా నిర్వహించుకుంటున్నారు. ఈలచెట్లదిబ్బ, లంకేవానిదిబ్బ రెండూ మత్స్యకార గ్రామాలే. కొద్ది కాలంగా కృష్ణానదిలో వేట సరిహద్దుల వివాదం ఈ రెండు గ్రామాల్లో రాజుకుంది. ఈనేపథ్యంలో లంకేవానిదిబ్బలోని ఒక రాజకీయ నేత అండదండలతో ఆ గ్రామస్థులు ఈలచెట్లదిబ్బ ఎత్తిపోతల పథకానికి రాజు కాల్వ నుంచి వచ్చే బోదెకు సాగు, తాగునీరు రాకుండా మట్టి అడ్డుకట్ట వేసి నిలుపుదల చేశారని ఈలచెట్లదిబ్బ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పూనుకుని ఖరీఫ్ సాగుకు అదును పోకుండా ఈలచెట్లదిబ్బలోని పొలాలకు సాగునీరును అందించాలని కోరుతున్నారు.

కృష్ణానదిలో మునిగి యువకుడి దుర్మరణం

చల్లపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో ప్రమాదవశాత్తూ మునిగి యువకుడు మృతిచెందాడు. నిమ్మగడ్డ గ్రామానికి చెందిన మేడేపల్లి శ్రీనివాసరావు కుమారుడు తేజ్ బాబు(21) ట్రాక్టర్ నడుపుతుంటాడు. సీతపేడలలంకలో పొలం ఉండటంతో స్నేహితుడితో కలిసి వెళ్లి శనివారం మధ్యాహ్నం తిరిగివస్తుండగా నదిలో మునిగి గల్లంతయ్యాడు. ఎప్పుడూ లంకకు వెళ్లే దారిలోనే నీటిలో నడుచుకుంటూ పొలం వెళ్లారని, తిరిగి వచ్చేడప్పుడు లోతులోకి అడుగు వేయటంతో ఊబిలోకి కూరుకుని ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. ముందు నడుస్తున్న స్నేహితుడు తేజ్‌బాబు నీటిలో మునిగిపోవటంతో కేకలు వేశాడు. దీంతో సమీపాన ఉన్నవారు వచ్చి వెతికినప్పటి కీ కనిపించలేదు. స్థానికులు, కుటుంబసభ్యులు, ఎస్సై పీఎస్వీ సుబ్రహ్మణ్యం సంఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. పడవలపై గాలించారు. ఈతగాళ్లతో వలలు వేయించారు. సాయంత్రానికి యువకుడి మృతదేహం లభ్యమైంది. నిమ్మగడ్డ దళితవాడలో విషాదం అలుముకుంది. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. వీఆర్వో కళ్లేపల్లి బేబి శవపంచనామా నిర్వహించగా, హెచ్‌సీ వెంకట్రావ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తాగిన ఎలక్ట్రీషియన్ చికిత్స పొందుతూ మృతి

చల్లపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ చికిత్సపొందుతూ విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో శనివారం ఉదయం కన్నుమూశారు. లక్ష్మీపురం శివారు చింతలమడ దళితవాడకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ నిమ్మగడ్డ హరిప్రసాద్ కడుపు నొప్పి తాళలేక ఈనెల 1వ తారీఖున పురుగుమందు తాగాడు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ శనివారం ఉదయం కన్నుమూశాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లక్ష్మీపురం వీఆర్వో తూము శ్రీనివాసరావు శవపంచనామా నిర్వహించగా, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వార్డు సచివాలయ ఉద్యోగులు శనివారం మునిసిపల్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కమిషనర్ బాపిరాజుకు వినతిపత్రం సమర్పించారు. క్లస్టర్ విధుల కేటాయింపు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా ఉందని, రెండు ఇంక్రిమెంట్లు పెండింగ్ ఉన్నాయని, ప్రమోషన్ చానల్ కల్పించి పదోన్నతులు ఇవ్వాలని కమిషనర్‌ను సంఘ నాయకులు కోరారు. జేపీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



తాడేపల్లిలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు

బై బై గణేశా!

మచిలీపట్నం టౌన్/పెడన/గూడూరు/నాగాయలంక/ఘంటసాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాలు శనివారం వైభవంగా నిర్వహించారు. మంగినపూడి బీచ్‌లో భారీ సంఖ్యలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. పెడన బ్రహ్మ ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. కొల్లూరు పుల్లయ్య ధర్మసత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన గణనాథుడిని రామరాజుపాలెం కాలువలో నిమజ్జనం చేశారు. గూడూరు ఇందిరమ్మ కాలనీ వినాయక మండపంలో గణనాథుడిని రామరాజుపాలెం కాలువలో నిమజ్జనం చేశారు. లడ్డూను రూ.12,400కు మురారి రవి పాడుకున్నారు. ఘంటసాల మండలం తాడేపల్లిలో పూజలందుకున్న గణనాథుడిని శ్రీకాకుళం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. నాగాయలంక ప్రసన్న గణపతిస్వామి ఆలయం నుంచి ప్రసన్న గణపతిస్వామి వసంతోత్సవాన్ని పురవీధుల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం వినాయకుడిని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. నంగేగడ్డలో వినాయకుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి నాగాయలంకలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.